ప్రజాశక్తి
స్నేహ
ఆదివారం అనుబంధం
జూన్ 11, 2017

వెలుగుల చదువులు



NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

మన హాలీవుడ్ హీరోయిన్‌లు

ప్రియాంక

బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ హాలీవుడ్‌లోనూ సత్తా చాటుకుంటున్నారు. హాలీవుడ్ చిత్రాలు, టి.వి. షోల్లో ఎక్కువగా అవకాశాలు దక్కించుకుంటోంది ప్రియాంక చోప్రా. 'బేవాచ్', 'క్వాన్టికో' చిత్రాల విజయం తర్వాత ప్రియాంకకి హాలీవుడ్‌లో ఆఫర్లు ఎక్కువయ్యాయి. ఇటు బాలీవుడ్‌తోపాటు హాలీవుడ్‌లోనూ మంచి ఇమేజ్‌ని సంపాదించుకుంటోంది దీపిక పదుకునే. 'ట్రిపుల్ ఎక్స్' చిత్రంతో తన హాలీవుడ్ ప్రస్థానం మొదలయ్యింది. మొట్టమొదట హాలీవుడ్ అరంగేట్రం చేసింది మాత్రం ఒకప్పటి మిస్ ఇండియా, మోడల్ పెర్సిస్ ఖంబట్టా. బాలీవుడ్‌లో అవకాశాలు కాస్త బెడిసికొట్టడంతో 'కండక్ట్ అన్‌బికమింగ్' చిత్రంతో 1975లో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. 'ద విల్బి కాన్స్పిరసీ' చిత్రాల్లో నటించింది. 'స్టార్ ట్రెక్' సైఫై చిత్రంలో పూర్తిగా జుట్టులేకుండా కనిపించే లూటినెంట్ లియ పాత్రతో ఎక్కువమందికి గుర్తుండిపోయింది పెర్సిస్. 'ది బ్రైడ్ అండ్ ప్రిజుడీస్, 'ది పింక్ పాంథర్-2', 'ది లాస్ట్ లీజియన్' లాంటి చిత్రాలు ఐష్‌కి మంచి పేరు తెచ్చిపెట్టాయి. పెర్సిస్ తర్వాత హాలీవుడ్‌లో అంతలా క్రేజ్‌ని సంపాదించింది కూడా ఐషే.

ఐష్

జాక్వెలిన్ ఫెర్నాండెజ్

'ది నేమ్ సేక్' అనే త్రిభాషా చిత్రంతో టాబూ హాలీవుడ్ ప్రస్థానం మొదలైతే 'హిస్', 'పాలిటిక్స్ ఆఫ్ లవ్' చిత్రాల్లో నటించింది మల్లిక షెరావత్. 'స్లమ్ డాగ్ మిలియనీర్' తర్వాత ఫ్రీదా పింటో 'ఇమ్మోర్టల్స్' భారీ చిత్రంతో హాలీవుడ్ చిత్రసీమలో అడుగుపెట్టింది. 'రైజ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ఏప్స్' మరో చిత్రం. నిమ్రత్ కౌర్ (హోమ్ ల్యాండ్), జాక్వెలిన్ ఫెర్నాండెజ్ (డెఫినిషన్ ఆఫ్ ఫియర్), నర్గిస్ ఫక్రి (స్పై), బిపాసా బసు (ది లవర్స్) హాలీవుడ్ చిత్రాల్లో నటించారు. ఇప్పుడు కత్రినా, కంగనా, కరీనా కూడా తమ హాలీవుడ్ అరంగేట్రం గురించి ప్లాన్ చేసుకుంటున్నారు.

నర్గిస్ ఫక్రి

దీపికా

పెర్సిస్ ఖంబట్టా

మల్లిక

నిజంలో బాహుబలి



విజేత

'బాహుబలి' 1,2లు రెండూ వచ్చినా ఆ పేరు వినగానే చటుక్కున గుర్తొచ్చే విన్యాసం అంతెత్తు జలపాతం పైభాగానికి అవలీలగా అస్సలు భయం లేకుండా చిన్న పిల్లాడి ఆటలా పైకెక్కేసే హీరో గురించే. అస్సలు మామూలు మనిషికిది సాధ్యమా! అలా చేశాడని సూపర్ హ్యూమన్ అని బాహుబలికి ప్రత్యేక శక్తి, సామర్థ్యాల్ని కట్టబెట్టేశారు. ఇలాంటి సూపర్ హీరోలు సినిమాల్లో తప్ప నిజంలో ఉండరని చెప్పుకుంటారు. కానీ ఒకడు అలాంటి అసాధ్యాన్ని చేసి చూపించాడు. ఎటువంటి సేఫ్టీ లేకుండా వేల అడుగుల ఎత్తు అత్యంత ప్రమాదకరమైన యోసెమిటీ ఏకశిలా కొండను వేలి కొసల పట్టు మీద ఎక్కేశాడు. అదీ భయాన్ని పక్కనబెట్టి సునాయాసంగా అనిపించేలా.

అమెరికాలోని యోసెమిటీ ఎల్ కెప్టెన్ గ్రానైట్ కొండను అధిరోహించడం తేలికైన విషయం కాదు. నిట్టనిలువుగా, నునుపుగా ఉండి పర్వతారోహకులకు అస్సలు పట్టు కుదరదు. దీన్ని ఎటువంటి సేఫ్టీ ఎక్విప్‌మెంట్ లేకుండా ఒట్టి చేతులతోనే ఎక్కేశాడు 31 ఏళ్ల అలెక్స్ హొన్నోల్డ్ అనే సాహసి. 3000 వేల అడుగుల ఎత్తు ఉండే ఈ కొండను ఈ నెల 4న కేవలం 3 గంటల 56 నిమిషాల్లో ఫ్రీ సోలో పద్ధతిన అధిరోహించాడు. ఈ విన్యాసం చేయకముందు అనేకసార్లు దాన్ని తాళ్ల సాయంతో ఎక్కి ఎక్కడ పట్టు ఉందనే విషయంపై అంచనాకు వచ్చాడు. ఓ బ్యాగులో సుద్ద పొడిని వేసుకుని ప్రతి పట్టు దగ్గర వేసి జాగ్రత్త తీసుకున్నాడు. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు ఎన్ని తీసుకున్నా ఒక్క తప్పిదం వేల అడుగుల ఎత్తు నుంచి గ్రానైట్ నేలపైకి పడేస్తుంది. అందుకే దీన్ని 'గ్రేటెస్ట్ ఫ్రీ సోలో ఆఫ్ ఆల్‌టైమ్'గా ప్రఖ్యాత ఆల్పైనిస్ట్ మేగజీన్ పరిగణిస్తోంది. బండల మధ్యనున్న సన్నని చీలికల్నే పట్టుకుని వేరే బండ మీదకు దూకి ఒట్టి వేళ్లతో బ్యాలెన్స్ చేసుకోవడం అసాధ్యంగానే అనిపిస్తుంది. ఇది అలెక్స్‌కు సాధారణమే అయినా తాళ్ల సాయముందనే ధైర్యం వేరు. ఇప్పుడిది వేల అడుగుల ఎత్తులో గాల్లోనే ప్రాణం ఊగిసలాడించడం లాంటిది. ఇలాంటి



ప్రాణాలతో చెలగాటమాడే ఫీట్ చేయాలని 2009లోనే అలెక్స్ సంకల్పించాడు. ఏళ్లుగా ఆ ఏకశిలను గమనించాడు. ఎన్నోసార్లు అది అసాధ్యమైన విషయంగానే అనిపించినా మనస్సులో మాత్రం దాన్నెలా అయినా గెలవాలనే కాంక్ష బలపడింది. అలా చేసిన ప్రపంచంలోనే తొలి వ్యక్తిగా రికార్డు ఊరించింది. అంతకు ముందు టామీ క్లాడ్‌వెల్ యోసెమిటీ మీద దాదాపు అలాంటి విన్యాసమే చేశాడు కానీ అది కొంత సేఫ్టీతోనే. ఒకవేళ పట్టుజారిపోతే లోయలో పడిపోకుండా తాళ్లున్నాయి. హార్నెస్‌లున్నాయి. అలెక్స్ మాత్రం ఇవేమీ లేకుండానే ఎల్ కెప్టెన్‌ను అధిరోహించాలని నిర్ణయించుకున్నాడే కానీ ప్రతి అడుగు మృత్యువుని దగ్గర నుంచి చూపించింది. దాన్నలా చూస్తూ కూడా అదో విషయం కాదన్నట్టు సౌకర్యవంతంగా వేల అడుగులు ఎలా ఎక్కగలిగాడనే ఊహే సాటి పర్వతారోహకులు చేయలేకపోయారు. టామీ క్లాడ్‌వెల్‌కు ఎన్నిసార్లు మానసికంగా అలెక్స్ పరిస్థితిని ఊహతో చవి చూద్దామనుకున్నా సాధ్యపడలేదు. ఊహని కూడా మనసు తట్టుకోలేకపోయింది. పైవరకు ఎందుకు అలెక్స్ ప్రధాన గోడ భాగానికి వెళ్లకముందే ఫ్రీ బ్లాస్ట్ ప్రమాదంలో పడ్డాడు. గాజు ఎలాగైతే చిట్లుతుందో అలా గ్రానైట్ పిచ్ స్లాబ్ విరిగిపోతుంది. అలాంటి స్లాబ్‌పై జాగ్రత్తగా పైకి చేరాక వేలికి కూడా పట్టునివ్వని గోడ ఎదురైంది. పక్కకు ఒరగడమో, లేదా దూకడమో చేసి మరో పగులిని అందుకోవాలి. ఈ సాహసం కూడా చేసేసి అలెక్స్ నివ్వెరపరిచాడు. అలెక్స్ అసలైన సవాలు 2300 అడుగుల ఎత్తులో ఎదురైంది. అప్పటికే గంటల తరబడి ఎక్కడంతో వేళ్లు మొద్దుబారి పోయాయి. సరిగ్గా అదే పాయింట్‌లో ఉధృతమైన గాలికి తోడు వేలు కూడా దూర్చలేని కొండ పగులు మొదలైంది. అంటే మనిషి పూర్తి బరువు వేలి కొసల మీద ఆపాలన్న మాట. ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందే ఊహించిన అలెక్స్ కేవలం వేలి మీదే దండీలు తీయడం, వేళ్లతో గోడ అంచుల్ని పట్టుకుని గంటల తరబడి అలానే ఉండిపోవడం వంటి వ్యాయామాల్ని సాధన చేశాడు. అలాగే పట్టు జారితే మరణం తథ్యమనే భయాన్ని కొండ కిందే విడిచిపెట్టేశాడు. చాలావరకు సాహసికుల ప్రాణాల్ని నిలబెట్టేది ఈ భయమే. ప్రమాదం ఎదురైనపుడు ఈ భయం వారి శరీర శక్తి సామర్థ్యాల్ని అమాంతం పెంచేసి ఊహించని విన్యాసాలు చేయించి సమస్య నుంచి బయట పడేస్తుంది. కానీ ఇక్కడ అలెక్స్ భయాన్ని వదిలేసేందుకు మానసికంగాను సాధన చేయడంతో అసంకల్పిత ప్రతీకార చర్యలు ఉండవు. అంటే ఆ చర్య జరిగినపుడు శారీరికంగా, మానసికంగా మనిషి ఎలా అలెర్ట్ అవుతాడో అలా ప్రతి క్షణం ఉండేలా అలెక్స్ సన్నద్ధమైనట్టే. ఇదే శాస్త్రవేత్తల్ని ఈ విన్యాసాన్ని నేరుగా పరీక్షించేందుకు ప్రేరేపించింది. భయం లేకుండా ప్రాణాల్నే ప్రమాదంలో పెట్టి ఎల్ కెప్టెన్‌ను ఎక్కుతున్న అలెక్స్ మెదడు పనితీరు ఎలా ఉందో పరీక్షించారు. సాధారణ మనిషి మెదడుకు దీనికీ తేడాలు, విలక్షణతలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- జేఎస్

ఇండెక్స్

వెలుగుల చదువులు

సందర్భం................3
అడవి కన్ను

స్టార్........4
ఉల్లాసంగా..ఉత్తేజంగా

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం............... 10
నీటి రుచిమరిగి

స్ఫూర్తి...............11
మూడో వ్యోమగామి

కవిత్వమ్...............14
ఆకలి వ్యాధికి వైద్యం కావాలి

తెలుసా 15
ప్రాణదాతల రోజు

అట్టమీది కథ...6

అనుబంధం.. ఆత్మీయత అంటే..?

ఆపాత చిత్రం - 12

కథ 16
వధ్యశిల

ప్రత్యేకం...........19
అంటార్కిటికా వనిత

కొత్త పుస్తకాలు..............20
తెలంగాణ కవులు

రుచి.............21
మష్రూమ్ పసంద్

బాల నేస్తాలు.............22
ఫిఫాకు చాన్స్

పద వికాసం......24

ఆపాత చిత్రం ఆకట్టుకుంది

ఆపాత చిత్రం 'మల్లీశ్వరి' గురించి ఇచ్చిన సమాచారం చాలా బాగుంది. వాహినీ వారి స్టూడియోలో నిర్మాణం జరిగింది అని తెలిపారు. సాలూరిగారి సంగీతం, దేవులపల్లి గారి బాణీలు ఎంతో బాగుంటాయి. మొత్తంగా ఈ చిత్రం అజరామరంగా తీర్చిదిద్దబడింది. భానుమతి, ఘంటసాల గారి గీతాలాపన బహు బేష్. ఈ చిత్రంలో పనిచేసిన అందరూ చిరకాలం చరిత్రలో నిలిచిపోతారు.

-కెవియన్ సీతారామాంజనేయులు, విజయవాడ

ఎవరెస్ట్ ఎక్కాలంటే

స్నేహ అనుబంధంలో ప్రచురించిన బాలీవుడ్ స్టార్ అమీర్‌ఖాన్ నటించిన పాత్రలు చాలా అద్భుతంగా ఉన్నాయి. విజేతగా అతిచిన్న వయస్సులోనే రికార్డు బద్దలు కొట్టిన స్పీడ్ స్టార్ అర్జున్ మైనీకి అభినందనలు. అట్టమీది కథ 'ఎవరెస్ట్ ఎక్కాలంటే..' చాలా బాగుంది. చావుబతుకులతో పోరాట సాహసం చెయ్యాలంటే ధైర్యం చాలా అవసరం. ఎవరెస్ట్ ఎక్కి సంచలనం సృష్టించిన 13 ఏళ్ళ పూర్ణకి కంగ్రాట్స్. 'వింతలోకం'లో విరగబడి నవ్వితే ఎలాంటి ఇబ్బందులకు గురౌతామో వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో అంతర్జాతీయ స్థాయి (దాదా సాహెబ్ ఫాల్కే) అవార్డుని అందుకున్న చిత్రం 'మల్లీశ్వరి'. ఈ చిత్రంలో నాగరాజు మల్లి పాత్రల్లో నటీనటులు అద్భుతంగా నటించి చిత్రానికి ప్రాణం పోశారు. నాటి నుండి నేటి వరకు అలనాటి పాటలు మరవలేము. ఈ చిత్రం యూనిట్ ప్రొడక్షన్ యస్ రాజేశ్వరరావు, ఎన్‌టిఆర్ అందరూ అభినందనీయులు. ప్రతి వారం పాత చిత్రాల గురించి ప్రచురిస్తున్న స్నేహకు ధన్యవాదాలు. నవ్వుల్ పువ్వుల్, కవిత్వమ్ బాగున్నాయి. బాల నేస్తాల్లో నీడతో బొమ్మ పిల్లలు ఎంజాయ్ చేశారు. లిటిల్ స్టార్ వరుణ్ సందేశ్‌ని చూపినందుకు థ్యాంక్స్. చివరి పేజీలో భ్రమల సరస్సు అందాలు అబ్బురపరిచాయి. ఇంద్రధనస్సు గ్రామంలో మురికివాడను రెయిన్ బో విలేజ్‌గా మార్చిన స్కూల్ ప్రిన్సిపల్ అభినందనీయులు.



-అనుపోజు. సంతోషి నాగరాజు, విజయవాడ

ఇంద్ర ధనస్సు గ్రామం

మురికి వాడని రెయిన్‌బో విలేజ్‌గా మార్చిన స్లామెట్ విడోడో కృషి అభినందనీయం. ప్రజాసమస్యలని పరిష్కరించడంలో నిబద్ధత కలిగిన జర్నలిస్ట్‌గా పేరుతెచ్చుకున్న ఆర్ట్ కల్లెన్‌కి హ్యాట్స్ ఆఫ్. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి. భ్రమల సరస్సు చిత్రాలు ఆకట్టుకున్నాయి. పుట్టినరోజు వేడుక కథ, ఎవరెస్ట్ ఎక్కాలంటే అట్టమీది కథ ఆద్యంతం చదివించాయి. పుస్తకాల పల్లె, ఆపాత చిత్రం మల్లీశ్వరి, చిప్ ఉద్యోగాలు, విరగబడి నవ్వితే, పబ్లిక్ సర్వెంట్, మరో స్పీడ్‌స్టార్ బాగున్నాయి.

- కె.లక్ష్మణ్, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

అడవి కన్ను



మనమిప్పుడు అడవుల్లో బతకడం లేదు. ప్రకృతిని దూరంగా చూస్తున్నాం. అస్పష్టంగా అర్థం చేసుకుంటున్నాం. మరి వన్యప్రాణులిలా ఉంటాయని కచ్చితంగా తెలిసేదెలా? మేం నాట్ జియో, యానిమల్ ప్లానెట్ చూస్తుంటాం. మాకు బాగా తెలుసు.. అమెజాన్ అడవుల్లోని అనకొండలు, హిమాలయాల్లోని మంచు చిరుతలు. డిస్కవరీలోను అరుదైన ప్రాణులపై డాక్యుమెంటరీలు వేస్తుంటారు. చానళ్లే కాదు వారి మేగజీన్‌లు కొన్ని పాఠశాలల్లో దొరుకుతుంటాయి. వాటినీ చదువుతుంటాం. వాటిల్లో పచ్చపాము బొమ్మ ఎంత స్పష్టంగా ఉంటుందో తెలుసా! అని మీరు ఆనందంగా అంటే మాకు సంతోషం. మరి మన సంతోషాన్ని ఎవరిస్తుంటారో తెలుసా. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు. వారిలో మన భారత్‌కు చెందిన వరుణ్ ఆదిత్య కూడా ఒకడు. ఈ కుర్రాడికి ఇటీవల నాట్‌జియో ఉత్తమ సత్కారాన్ని అందించింది.

కోయంబత్తూర్‌కు చెందిన వరుణ్ ఆదిత్య (26) తల్లిదండ్రులు బ్యాంకర్లు. ఎప్పుడూ వారు ఊళ్లు మారాల్సివచ్చేది. అందుకే సరైన మిత్ర బృందం ఏర్పడలేదు. అలాగే తాను కూడా ఒంటరిగానే ఉండేవాడు. ఈ పరిస్థితి నుంచి ఫొటోగ్రఫీ బయటపడేసింది. తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించింది. 2011లో ఎంబీయే చదివేందుకు లండన్ వెళ్లినపుడు తన ఫోన్‌తోనే అద్భుతమైన ఫొటోలు తీస్తూ అందరి దృష్టిని ఆకర్షించేవాడు. ఆ తర్వాత తల్లిదండ్రుల్ని ఒప్పించి డీఎస్సెలార్ కెమెరా కొనుక్కుని వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచానికి పంచుకునేవాడు. అప్పటి వరకు తననెపుడూ నిరాశ పరిచే స్కూల్, కాలేజీ వాతావరణం, అధ్యాపకుల తీరు నుంచి సామాజిక మాధ్యమాల్లో వచ్చే స్పందన కొత్త జీవితాన్నిచ్చింది. ఉన్నత చదువులవగానే స్టాక్ ట్రేడర్‌గా తొలుత పనిచేశాడు. కానీ ప్రకృతి ప్రేమలో పూర్తిగా పడిపోయాడు. లండన్‌లో ఉన్నపుడే పార్కులు, జూలు తిరుగుతూ అక్కడి పక్షుల్ని, కీటకాల్ని ఫొటోలు తీసేవాడు. పర్‌ఫెక్ట్ పిక్చర్ కోసం మైళ్లకు మైళ్లు తిరిగిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఎందుకంటే యాక్షన్ ఫొటోగ్రఫీ అంటే ప్రాణమైపోయింది. కదిలే ప్రాణుల్ని స్తంభింపజేసిన భావన అది అందిస్తుంది. ఈ ఫొటోగ్రఫీలో మెళకువల్ని యూట్యూబ్, గూగుల్ వంటి అంతర్జాల ప్రపంచం ద్వారానే నేర్చుకున్నాడు. తనకెంతో ఇష్టమైన డీఎస్సెలార్ కెమెరాను వేసుకుని అడవుల్లో తిరగడం మొదలెట్టాడు. పూలపై వాలే సీతాకోక చిలుకల నుంచి కొమ్మలకు చుట్టుకునే పాముల వరకు వాటి ప్రతి కదలికను షట్టర్ వేగంతో చప్పున కెమెరాలో పట్టేసేవాడు. ప్రతి కదలిక ఏమో గానీ వాటి ముఖాల్ని దగ్గరగా, స్పష్టంగా చూపే పొట్రెయిట్‌లు తీయడం అభిరుచిగా మారింది. అదే వరుణ్‌కు నాట్ జియో 'నేచర్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందించింది.

మారిన చిత్రం

ఓసారి నాట్‌జియో ఫొటోగ్రఫీ పోటీల్ని నిర్వహించి ప్రతిభ చూపిన వారికి కోస్టా రికా, పనామాల్లో ప్రఖ్యాత ప్రకృతి ఛాయాచిత్రకారుడు మైఖేల్ మెల్‌ఫోర్డ్ దగ్గర శిక్షణనిప్పించింది. దానికి వరుణ్ ఎంపికయ్యాడు. తర్వాత ఇండియాకొచ్చి బండీపురాలో అద్భుతమైన ప్రకృతి చిత్రాల్ని తీశాడు. అతడి ఆసక్తిని అర్థం చేసుకుని తల్లిదండ్రులు 10 లక్షలు అప్పు చేసి మరో రెండు లెన్సులు కొని బహుమతిగా ఇచ్చారు. పర్‌ఫెక్ట్ టైమింగ్‌కు అతడు పేరు సంపాదించాడు. అంతా పక్కాగా ఫొటో తీయడమే కాదు దానికి తగ్గ పేరు పెట్టడంలోను సృజనాత్మకంగా ఆలోచిస్తాడు. ముఖ్యంగా వరుణ్ తీసే పొట్రెయిట్‌ల్లో బ్యాక్‌డ్రాప్‌లు, కంపోజిషన్ చాలా లోతుగా, విలక్షణంగా ఉంటాయి. అవి విలక్షణమైన వాతావరణాన్ని ఫొటోకు అందిస్తాయి.

ఫ్రేమ్ కట్టాడు

మహారాష్ట్రలోని అంబోలి వర్షారణ్య ప్రాంతం. అక్కడ నిత్యం వర్షం కురుస్తూనే ఉంటుంది. ఇక్కడి అడవుల్లోనే అరుదైన ఎగిరే కప్ప జాతి ఉంది. వీటిని చిత్రీకరించేందుకు వరుణ్ వెళ్లాడు. మాక్రో లెన్స్‌లతో వాటిని శోధించడం మొదలెట్టాడు. కానీ ఇంతలో ఓ చిన్న కొమ్మకు పసరిక పాము చుట్టుకుని కనిపించింది. అక్కడి గ్రే బ్యాక్‌డ్రాప్‌ను దీని ప్రకాశవంతమైన రంగు అదనపు ఆకర్షణగా కనిపించింది. అది విషపూరితమే అయినా వైడ్ లెన్స్ వేసి చాలా దగ్గరగా వెళ్లి దాని పొట్రెయిట్‌ను తీశాడు. దాని బ్యాక్‌గ్రౌండ్‌ను చాలా విభిన్నంగా ఎంచుకున్నాడు. సాధారణంగా వాటి కేమోఫ్లేజ్‌ను బంధించడానికి పచ్చటి ఆకుల బ్యాక్‌డ్రాప్‌కు ఎక్కువగా వాడుకుంటారు ఫొటోగ్రాఫర్లు. కానీ వరుణ్ దానికి భిన్నంగా నలుపు, బూడిద రంగుల కలబోతలోనున్న బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకుని సర్పం కాంతివంతమైన రంగును హైలెట్ చేశాడు. అది సరిగ్గా కాటు వేసేందుకు పొజిషన్ తీసుకుంటున్న భంగిమలో క్లిక్‌మనిపించాడు. ఈ చిత్రం కోసం 23 షాట్లను తీసుకున్నాడు కానీ, పర్‌ఫెక్ట్‌గా వచ్చిందా లేదోనన్న సందేహం కలిగింది. ఆ చిత్రమే వరుణ్‌కు ప్రఖ్యాత పురస్కారాన్ని అందించింది. మొత్తం 20 వేలకు పైగా ఎంట్రీలు వస్తే చివరకు ఇదే ఉత్తమ చిత్రంగా ఎంపికైందంటే ఆ చిత్రం ప్రత్యేకత అర్థమవుతుంది. ప్రస్తుతానికి మన దేశంలో ఈ ప్రత్యేక ఛాయాచిత్ర కళకు ప్రోత్సాహం అంతగా లేకున్నా నాట్‌జియో లాంటి సంస్థ దృష్టిలో పడే వరకు వెళ్లాడంటే అది పూర్తిగా వరుణ్ ఆదిత్య ప్రతిభే. ఇలాంటి యువ ప్రతిభావంతులు మరింత మంది వెలుగులోకి రావాలని వన్యప్రాణి ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం. ★







అచ్చు ఐశ్వర్య రాయ్‌లానే ఉందే..! లేదు ఆమెను నకలుగా చూడలేం... తన ప్రత్యేకత తనదే..! స్నేహ ఉల్లాల్ చిత్ర పరిచయం ఆ తర్వాత కెరీర్‌లో వినబడిన మాటలు. ఐశ్వర్యతో పోల్చి అందానికి జిరాక్స్ కాపీ అని పొగిడినా... ఆ తర్వాత తనలోని ప్రత్యేకతను గుర్తించినా స్నేహ ఉల్లాల్ ఒకేలా తీసుకుంది. ఆ బ్యాలెన్స్ ఆమె కెరీర్‌ని స్థిరపరిచింది. కానీ అంతలోనే మిస్సింగ్. అసలు స్నేహ ఉల్లాల్‌కేమైంది. ఎందుకు సినిమాల్లో కనిపించడం లేదనే ప్రశ్న అభిమానుల్లో ఆందోళన కలిగించింది. స్నేహ ఉల్లాల్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినా తెలుగులో అభిమానులే ఎక్కువ. నాలుగేళ్ల తర్వాత మళ్లీ మరో తెలుగు చిత్రంతో వెలుగులీనబోతోంది. రక్త సంబంధిత ఆటో ఇమ్యూన్ డిసీజ్ పూర్తిగా క్షీణింపజేసినా దానితో ఓ యుద్ధమే చేసి మంచి ఫిట్‌నెస్‌తో కళకళలాడుతూ ఈ మధ్యే ఓ ఫొటో సెషన్ పూర్తి చేసింది.

ఉల్లాసంగా.. ఉత్తేజంగా...

స్నేహ ఉల్లాల్ ఒమన్ సుల్తానేట్ అయిన మస్కట్‌లో పుట్టింది.

- ఆమె తల్లిదండ్రులు మంగళూరుకి చెందినవాళ్లే. చాలాకాలం అక్కడే స్థిరపడ్డాక తల్లి స్నేహను తీసుకుని తిరిగి భారత్‌కు వచ్చేసింది.
- ముంబైలోని డ్యురెలో కాన్వెంట్‌లో హైస్కూల్ చదివింది. ఆ తర్వాత ఎంఎంకే కాలేజీలో చేరిన స్నేహకు సల్మాన్ ఖాన్ చెల్లెలు అర్పిత మంచి మిత్రురాలైంది.
- అలా సల్మాన్ ఖాన్ పరిచయమయ్యాక 'లక్కీ: నో టైమ్ ఫర్ లవ్' (2005)అనే సినిమాలో చాన్స్ దక్కింది.
- ఆ సమయానికి స్నేహ తల్లి ఉషా ఉల్లాల్ క్యాన్సర్ బారిన పడింది. ఆమె చికిత్సను దగ్గరుండి చూసుకోవడమే కాక సినిమాను పూర్తి చేసింది.
- స్నేహ ఉల్లాల్‌లోని అదనపు ఆకర్షణ ఆమె నీలి కళ్లు.
- టీవీ సీరియళ్లు, కార్యక్రమాల్లోను కనిపించి ఫ్యాన్ బేస్ పెంచుకుంది.
- ఆమెను తెరపై చూసిన చాలామంది ఐశ్వర్య రాయ్‌లా ఉందని పొగిడారు. నటనతోను మెప్పించడంతో దక్షిణాది చిత్ర పరిశ్రమ నుంచి కూడా అవకాశాలు వెల్లువెత్తాయి.
- తెలుగులో వచ్చిన 'ఉల్లాసంగా.. ఉత్సాహంగా...' ఇన్‌స్టంట్‌గా స్టార్‌ను చేసేసింది.
- స్నేహ చివరిగా చేసిన చిత్రం కూడా తెలుగుదే. 'అంతా నీ మాయలోనె' 2014లో విడుదలైంది. అప్పటికే వ్యాధి తీవ్ర దశకు చేరుకుంటోంది. అయినా డేట్లిచ్చిన షూటింగ్‌లకు శక్తిని కూడదీసుకుని హాజరయ్యేది.
- ఆర్యన్ (2006), 'జానే బీ దో యారో' (2007), 'ఖాష్ మేరే హోతే' (2009), 'క్లిక్' (2010), 'బెజుబాన్ ఇష్క్' (2015) హిందీ చిత్రాలు విడుదలయ్యాయి.
- తెలుగులో 'నేను మీకు తెలుసా?', 'కింగ్' (2008), 'కరెంట్' (2009), 'వరుడు', 'సింహా', 'అలా మొదలైంది' (2010), 'మడత కాజా' (2011), 'యాక్షన్ 3డి' (2013) చిత్రాల్లో నటించింది. ఓ బెంగాలీ చిత్రం 'మోస్ట్ వెల్‌కమ్', ఇంగ్లిష్ చిత్రం 'గాంధీ పార్క్', కన్నడ చిత్రం 'దేవి'లోను చేసింది.
- 2007లో ఆంగ్ల చిత్రం 'పైరేట్స్ బ్లడ్'లో అవకాశం వచ్చింది కానీ తుఫాను వల్ల ఆ చిత్రం నిలిచిపోయింది. ఆ తర్వాత వేరే నటికి ఆ అవకాశమిచ్చారు.
- అంతా బాగుందనుకుంటున్న దశలో ఉన్నట్టుండి ఆమె ఆరోగ్యం బలహీనపడింది. అలా షూటింగ్‌లకు హాజరకాలేక సినిమా అవకాశాల్ని వదులుకుంది.
- వైద్య పరీక్షల్లో అరుదైన వ్యాధి ఉందని తేలడంతో స్నేహ ఉల్లాల్ ఇక మళ్లీ తెరపై కనిపించదేమో అని సన్నిహితులు అనుకున్నారు.
- స్నేహకు ఏమైందో చాలామందికి తెలీదు. ఈ విషయం అందరూ మర్చిపోయేలోగా కోలుకుని తిరిగి సినిమా లోకంలో మెరిసింది.
- ఒకప్పుడు అరగంట పాటు కూడా నిలబడలేనంత బలహీనపడిపోయిన స్నేహ ఉల్లాల్ ఇప్పుడు కఠోర వ్యాయామాలు చేస్తూ ఫిట్‌నెస్ గురించి సూచనలిస్తోంది.
- నాలుగేళ్ల విరామంలో తన సృజనాత్మకతను వస్త్రాల ఫ్యాషన్ చూపింది. ఆమె డిజైన్లు సూపర్ హిట్ కూడా అయ్యాయి.
- శారీరికంగా జబ్బు తనను బలహీనరాలిని చేసిందేమో గానీ మానసికంగా అమె మరింత దృఢంగా తయారైంది. ట్విట్టర్ ద్వారా ఆమె ప్రపంచానికిచ్చే సందేశాలు చాలా బోల్డ్‌గాను, శక్తివంతంగాను కనిపిస్తాయి. బలహీనతల్ని గెలిచే కొటేషన్లను ఎక్కువగా పెడుతుంటుంది.
- ఫెమినిజమ్ అంటే మహిళకు శక్తినివ్వడం కాదని... స్త్రీ ఎప్పుడో సర్వ శక్తివంతురాలని.. ఆమె శక్తిని చూసే విధానంపై సమాజంలో మార్పు తేవడమే ఫెమినిజమని పేర్కొని శభాష్ అనిపించుకుంది.
- ఓసారి షూటింగ్‌లో రెండు రామచిలుకలు చనిపోతే బ్లూ క్రాస్ ద్వారా బాధ్యులపై కంప్లైట్ ఇచ్చింది. ఆమె ప్రాణి ప్రేమికురాలు. వన్యప్రాణుల ఆస్పత్రిని కట్టించాలనేది ఆమె లక్ష్యం.
- ప్రస్తుతం తెలుగులో 'ఆయుష్మాన్ భవ' అనే చిత్రాన్ని ఒప్పుకుంది. ఇందులో స్నేహ జలకన్యగాను నటిస్తోందని వార్తలు వచ్చాయి.
- సినిమా జగత్తులోకి ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ నుంచి కూడా ఓ ఆఫర్ ఆమెకు దక్కింది. అక్టోబర్ నుంచి ఆ చిత్ర షూటింగ్‌లోను పాల్గొంటుంది. ★

నవ్వుల్ - పువ్వుల్



ఓ ఆఫీసరు ఒక స్కూల్‌కి వెళ్లి పిల్లల్ని పిచ్చి పిచ్చి ప్రశ్నలు అడుగుతున్నాడు. ఇవేం ప్రశ్నలురా బాబూ అంటూ అందరూ తలపట్టుకుని కూర్చున్నారు. ఇంతలో ఆఫీసరు చింటూని లేపి నా నెల జీతం 12 వేలు అయితే ఇప్పుడు నా వయసెంత?? అని అడిగాడు?

చింటు : నలభై సంవత్సరాలు సార్....

ఆఫీసరు : అరే అంత కచ్చితంగా ఎలా చెప్పావ్

చింటు : ఏం లేదు మా అన్నకి సగం పిచ్చి వుంది. వాడి జీతం 6 వేలు. వాడి వయసు 20 సంవత్సరాలు.

రాము : టైమెంత?

సోము : పన్నెండు...

రాము : అంతేనా ఇంకా ఎక్కువైందనుకున్నా...

సోము : అంతకంటే ఎక్కువయ్యే అవకాశం లేదు...

రాము : అదేంటి?

సోము : పన్నెండు తర్వాత వచ్చేది ఒకటే కదా!

తండ్రి : నెలలన్నిటిలో చిన్నది?

బిట్టు : మే...

ఎలా చెప్పావు : ఎందుకంటే అందులో ఒకే అక్షరం వుంది కదా!!

భార్యని సరదాగా ఒక లెంపకాయ కొట్టాడు భర్త... మనం ఎవరినైతే ఎక్కువగా ప్రేమిస్తామో వారినే ఎక్కువగా కొట్టబుద్ధి వేస్తుంది తెలుసా...! అన్నాడు (అతి తెలివిగా)

వెంటనే భర్తకి నాలుగు లెంపకాయలు...రెండు మొట్టికాయలు తగిలించిన భార్య.... నా గురించి మీరేం అనుకుంటున్నారు. నేనేం మిమ్మల్ని తక్కువ ప్రేమిస్తున్నాననా....!!

బంటి : అమ్మా ఐస్ క్రీమ్ బండి వస్తోంది ఐస్ కొనివ్వవా...

అమ్మ : వద్దు బాబూ ఎండా కాలంలో ఎక్కువ ఐస్ క్రీమ్‌లు తినకూడదు. అవి చల్లగా వుంటాయి. గొంతునొప్పి చేస్తాయి.

బంటి : పరవా లేదులే అమ్మా....కొనివ్వు....వేడి చేసుకుని తింటాలే.....

పింకీ : స్వీటీ ఫ్రిజ్‌లో యాపిల్ వుంది నాలుగు ముక్కలు కట్‌చేసి తీసుకురా...

స్వీటీ : ఆరు ముక్కలు కోసి తెస్తాను....

పింకీ : వద్దు..వద్దు ఈ రోజు నేను డైటింగ్‌లో వున్నా....నాలుగు ముక్కలే తినాలి.

నాకు నచ్చిన చిత్రం

ఇల్లస్ట్రేటర్: పావెల్ వుయిజ్కో

సేకర్త: పి.బాలు, మచిలీపట్నం

కిసుక్కు సిత్రం

ఓర్నీ.. యావో మింగ్! ఈ నవ్వు నీదేనా..!

వెలుగుల చదువులు

- కె.ఎస్.లక్ష్మణరావు (మాజీ ఎమ్మెల్సీ)
9490098004

బడులు మొదలవుతున్నాయి. చదువుల పరుగులు కనబడుతున్నాయి. చదువు సంధ్యలపై శ్రద్ధ ఎక్కువే కనిపిస్తోంది. కానీ అదంతా కూడా బట్టీ చదువులకు, పుస్తకాల అరగదీతకే పరిమితమవుతోంది. నిజమైన విద్య అంటే అన్ని విషయాల్లో వికాసం చెందడమే. వ్యాయామం, ఆటలు-పాటలు, ప్రయోగాలు, వృత్తి విద్య తర్ఫీదులు, సృజనాత్మక కార్యక్రమాలు, శాస్త్రీయ దృక్పథం, ముఖ్యంగా నైతిక విలువలు, సామాజిక స్పృహ ఇవన్నీ కలిస్తేనే. ఇలాంటి వెలుగుల చదువులు ఎక్కడ కనిపిస్తున్నాయి. ఓ రకంగా చూస్తే ఇతర సమస్యలున్నా వ్యక్తిత్వ వికాసం, సాంఘిక దృక్పథం కొద్దో గొప్పో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లోనే కనబడుతోంది. ఈ వెలుగుల చదువుల తీరెలా ఉందనే విషయంపైనే ఈ వారం అట్టమీది కథ.

అనంత్ ఉత్సాహంగా చలాకీగా ఉండే పిల్లాడు 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల అనంత్ నిర్లిప్తంగా, ఏదో కోల్పోయిన వాడిలా తయారయ్యాడు. తల్లిదండ్రులు మానసిక వైద్యనిపుణుల వద్దకు తీసుకువెళ్ళారు. ఆయన అనంత్‌తో మాట్లాడిన తరువాత 'పిల్లాడికి ఎలాంటి జబ్బులేదు. చదువు ఒత్తిడికి గురవుతున్నాడు. ఆ పిల్లాడికి ఆటలు, పాటలకు అవకాశముండే పాఠశాలలో చేర్పించండి.' అని సలహా చెప్పాడు. 'రోజూ ఇటువంటి కేసులు 10కి పైగా వస్తున్నాయని, విద్యారంగ ధోరణుల్లో మార్పు రావాలని, ఈ మార్పు ఎలా వస్తుందో అర్థం కావటం లేద'ని వాపోయాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో చదువుల ఒత్తిడి, పరీక్షల ఒత్తిడిని విద్యార్థులతోపాటు కుటుంబాలు కూడా ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 60 వేల పాఠశాలల్లో లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. పిల్లలను బాగా చదివించాలనే తపన, ఆరాటం సమాజంలో పెరగటం సానుకూలమైన అంశం కాగా, విద్యారంగం పెద్ద ఎత్తున కార్పొరేటీకరణ చెందటం ప్రతికూల అంశంగా కనబడుతోంది.

కార్పొరేటీకరణే ముంచింది

దేశంలో 1950 నుండి 1990 వరకు విద్యారంగానికి ప్రభుత్వం ప్రాముఖ్యత ఇచ్చింది. 1966లో నివేదిక సమర్పించిన కొఠారి కమిషన్ పాఠశాల విద్య ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని చెప్పింది. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ప్రభుత్వమే ఏర్పాటుచేసి విద్యా అవకాశాలను కల్పించింది. సి.వి.రామన్, దువ్వూరి సుబ్బారావు వంటి మేధావులతో సహా ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలు అధిరోహించారు. 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల ప్రభావం వైద్యరంగంపై పడి ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రారంభమై, రెండు తెలుగు రాష్ట్రాల్లో కార్పొరేట్ సంస్థలు విద్యారంగాన్ని నియంత్రించటం ప్రారంభించాయి. ఇంటర్ విద్య దాదాపు 90 శాతం కార్పొరేట్ సంస్థల ఆధీనంలోనే కొనసాగుతోందనడంలో అతిశయోక్తి లేదు. కార్పొరేట్ సంస్థల వలన చదువుల ఒత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయి. తల్లిదండ్రుల

తీవ్ర వైరుధ్యాలు

1950 నుండి 1990 వరకు పాఠశాల విద్య ప్రభుత్వ సంస్థలలోనే కొనసాగింది. జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలోనే విద్యార్థులందరూ విద్యను అభ్యసించారు. సమాజంలో మహోన్నత విజయాలు సాధించిన వ్యక్తులంతా ఈ పాఠశాలలోనే చదివారు. నోబెల్ బహుమతి గ్రహీత సి.వి.రామన్ విశాఖపట్నంలో ఒక ఎయిడెడ్ పాఠశాలలో చదవడం దీనికి మంచి ఉదాహరణ. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత, కొద్దికాలంలోనే విద్యారంగంలో ప్రైవేట్ సంస్థలు చొచ్చుకువచ్చాయి. ఈ



రోజుకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగినంతగా విద్యారంగ ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ మరో రాష్ట్రంలో జరగలేదు. విద్యారంగంలో ప్రైవేటీకరణ తిమింగలంలా విస్తృతమై కార్పొరేటీకరణకు చేరినది. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యలో దాదాపు 50 శాతం మంది పిల్లలు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలలో చదువుతున్నారు. కార్పొరేట్ల అధిపతులు రాజకీయ రంగాల్లో కూడా ప్రవేశించి, మంత్రులై, ప్రజాప్రతినిధులై విద్యా వ్యవస్థను నియంత్రించే స్థాయికి చేరుకున్నారు. విద్యాలో తీవ్ర అసమానతలు ఏర్పడి పేదపిల్లలు, ఇతర అణచివేతకు గురైన వర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటే, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి పిల్లలు ప్రైవేట్ సంస్థలలో చదువుతున్నారు.

ఆకాంక్షలను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. ప్రభుత్వ జోక్యం తగ్గిపోతోంది. ఈ సమయంలో ప్రభుత్వం కీలక పాత్రను పోషించాలి. పాఠశాల విద్య విధానాలను సమీక్షించుకుని కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించే విధంగా చట్టం తేవాలి. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అర్హతగల ఉపాధ్యాయులు, క్రీడా మైదానాలు, ప్రయోగశాలలు ఉండే విధంగా చర్యలు చేపట్టాలి. పాఠశాలలు ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు మాత్రమే టైం టేబుల్ ఉండే విధంగా పర్యవేక్షించాలి. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని నియంత్రిస్తున్నాయి.

తల్లిదండ్రులైనా ఆలోచిస్తున్నారా...

మూడు దశాబ్దాల క్రితం వరకు కుటుంబంలో ఎక్కువ మంది పిల్లలు జన్మించేవారు. నేడు మారిన పరిస్థితులలో కుటుంబంలో ఒకరు లేక ఇద్దరు పిల్లలను కంటున్నారు. తల్లిదండ్రులు తమ ఆశలు, ఆకాంక్షలన్నీ ఆ పిల్లాడు/పాపపై పెట్టుకుని బతుకుతున్నారు. వీలైనంత మంచి పాఠశాలల్లో చేర్చాలనే తపనతో కార్పొరేట్ పాఠశాలల్లో చేరుస్తున్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో తల్లిదండ్రుల కాంక్షలు విపరీతంగా పెరిగాయి. ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లల శక్తి, సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకోకుండానే తమ పిల్లలు ఐ.ఐ.టిలో చదవాలి, మెడిసిన్‌లో సీటు సంపాదించాలని కోరుకుంటున్నారు. కానీ ఎంతమందికి సీట్లొస్తాయి. ఆ కళాశాలల్లో చదివే వారందరికీ అది సాధ్యమా. అయినా ఆ చదువులు తప్ప వేరేవే లేవా. విద్యార్థి ఆసక్తి, అభిరుచి, ఆకాంక్షలకి విలువే లేదా. ప్రత్యామ్నాయ చదువులు, వృత్తులు, వాటిలోని అవకాశాలపై కనీస అవగాహన లేమి ఈ పరిస్థితికి ఓ కారణం. అలాగే పక్కవారు ఏది చేస్తున్నారో అదే చేయాలనే అనుకరణ కూడా చేటు కలిగిస్తోంది.

అందుకే ఐ.టీ., సేవా రంగాల్లో ఏ మాత్రం తేడా వచ్చినా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలపై పిడుగు పడుతోంది. చదివిన చదువుకూ చేసే ఉద్యోగానికి సంబంధం లేకుండా నలిగిపోయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. మెడిసిన్ చదువుల పరిస్థితి దీనికేం భిన్నం కాదు. విభిన్న రంగాల్లో పురోగతే దేశాభివృద్ధిని నిలకడగా ఉంచుతుంది. అలాగే భావి పౌరులైన విద్యార్థులకు ఆశావహ వాతావరణం, భవిష్యత్తును ఏర్పాటు చేస్తుంది. అటుగా తల్లిదండ్రులు, ప్రభుత్వాలు ఆలోచించి అనేక రంగాల వైపు చదువుల వెలుగులు ప్రసరించేలా చేయాలి. సృజన రంగాలకు, క్రీడలకు పెద్ద పీట వేయాలి. విద్యార్థులకు ఆ వైపూ ఊపిరి ఆడనివ్వాలి.

ఉపాధ్యాయులే కీలకం

ఒకప్పుడు ఉపాధ్యాయుడంటే గొప్ప నమ్మకం.. గౌరవం. కానీ ఇప్పుడు డబ్బు పెడుతున్నాం కదా అని తల్లిదండ్రులు, జీతాలు ఇస్తున్నాం కదా అని సంస్థలు వారిని ఉద్యోగుల స్థాయిలోనే చూస్తున్నారు. విద్యార్థిని తల్లిదండ్రుల స్థాయిలో ప్రభావితం చేసే వ్యక్తి ఉపాధ్యాయుడు. కేవలం పాఠ్యపుస్తకాలు, తరగతి గదులకే పరిమితం కాకుండా మొత్తం ప్రపంచాన్ని అవగతం చేసే అవకాశం, విద్యార్థి భవితను తీర్చిదిద్దే బాధ్యత టీచర్‌ది. చాలామంది ప్రముఖులకు వారి రోల్ మోడళ్లు టీచర్లే. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. తల్లిదండ్రులు, సంస్థలే కాదు విద్యార్థులు కూడా లెక్క చేయని స్థితికి చేరుతుండటం ఆలోచించాల్సిన విషయం. మరో తరహాని కూడా చూస్తున్నాం. కొన్ని ప్రధాన పాఠ్యాంశాల్ని వల్లె వేయిస్తూ, బండెడు హోమ్ వర్కును విద్యార్థి నెత్తిన వేస్తూ, అదిలింపులు, బెదరింపులతో పూర్తిగా గానుగ ఎద్దు వ్యవహారం



చేసేస్తున్న అధ్యాపక వర్గాన్ని చూస్తున్నాం. జీతాల్లో హైక్‌లు, ప్రమోషన్లు, పెర్క్‌లు, విద్యార్థుల్ని సంస్థల్లో చేర్పిస్తే వచ్చే అదనపు ఆదాయాల మీదే ధ్యాస కేంద్రీకరిస్తూ పాఠం నోటెంట రాబడితే... పేపర్ మీద అక్షరం తొణక్కుండా రాయించగలిగితే చాలు... పరీక్షల్లో జిరాక్స్ కాపీల్లా నొక్కించగలిగితే సరిపోతుందనే ఈ నయా మనస్తత్వాలకు కారణం ప్రభుత్వం నుంచి విద్యా రంగం చేజారిపోవడమే. కొద్దో గొప్పో ప్రభుత్వ బడుల్లో విద్యార్థి వికాసానికి టీచర్లు చిత్తశుద్ధిగా పనిచేయడం ఎక్కువగా కనిపిస్తుంది. ఉత్తమ ఉపాధ్యాయులుగా, జీవితాంతం గుర్తుంచుకునే గురువులుగా విద్యార్థుల జీవితాల్లో వెలుగులు తేవాలని పరితపించే అధ్యాపకులు కనిపిస్తున్నారు. విద్యారంగంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనది. డాక్టర్ అబ్దుల్ కలాంతో సహ లక్షలాది మంది ఉపాధ్యాయులచే ప్రభావితమై ఉన్నత శిఖరాలు అధిరోహించారు. పాతకాలంలో ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల్లోనే నివశిస్తూ, నిబద్ధతతో పనిచేస్తూ, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేవారు. మారిన జీవన శైలి, వాతావరణంలో ఉపాధ్యాయులు ఈనాడు గ్రామీణ ప్రాంతాల్లో నివసించడం లేదు. కానీ మారిన పరిస్థితులలో, ప్రపంచీకరణ ఆకాంక్షలలో ఉపాధ్యాయుడు-విద్యార్థి సంబంధాలు బలహీనపడ్డాయి. కొంతమంది ఉపాధ్యాయులలో నిబద్ధత లోపించింది. దీనికి సంబంధించి కొన్ని నూతన ఆలోచనలు చెయ్యాలి. ఉపాధ్యాయుల్లో నిబద్ధత పెరిగే విధంగా శిక్షణా తరగతులు నిర్వహించాలి. ఉపాధ్యాయులు తమ బోధనతో విద్యార్థులకు స్ఫూర్తినివ్వాలి. విద్యార్థులలో సృజనాత్మకత పెంచే విధంగా బోధన ఉండాలి. చదువుతో పాటు విద్యార్థుల అభిరుచులను గమనించి, ఆ రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి.

విస్తృతమే కానీ...

రేపటి నుంచి మరో నూతన విద్యాసంవత్సరం ప్రారంభమౌతున్నది. తల్లి,తండ్రులలో, విద్యార్థులలో ఎన్నో ఆశలు, ఆకాంక్షలు. ఒత్తిళ్లు, నిరాశలు, నిస్పృహలు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యావ్యవస్థ ఎంతో విస్తృతమైనది. 60 వేలకు పైగా పాఠశాలలు, 83లక్షల మంది పిల్లలు, 2,87,000 వేల మంది ఉపాధ్యాయులు (ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి) ఉన్న వ్యవస్థ ఇది. 98 శాతం జనావాసాలకు 1 కి.మీ. దూరంలో మనకు బడి ఉంది. పాఠశాలల భౌతికమైన అందుబాటుకు ఏ కొరత లేదు. పాఠశాల విద్య కోసం ప్రభుత్వ రంగంలో 10 వేల కోట్లు, ప్రైవేట్ రంగంలో మరో 10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. సమాజంలో చదువు పట్ల ఆసక్తి పెరగడం ఒక సానుకూలమైన పరిణామం. తల్లిదండ్రుల్లో తమ పిల్లల చదువుపై ఊహించలేనంత ఆతృత వ్యక్తమౌతున్నది. తమ పిల్లలను వీలైనంత మంచి పాఠశాలలో చేర్పించాలని, నాణ్యమైన విద్య అందించాలని ఆరాటపడుతున్నారు. ఈ ఆరాటాన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. అప్పులు చేసైనా కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులు కట్టడానికి సిద్ధపడుతున్నారు.

బాల్యమేమైపోతోంది...

గత రెండు దశాబ్దాలుగా విద్యారంగ కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విద్యాసంస్థల మధ్య అనారోగ్యకరమైన పోటీకి దారి తీసింది. విద్యార్థులు సాధించే మార్కులు, గ్రేడులే విద్యా మార్కెట్‌లో తమ ఉనికిని పెట్టుబడులని గ్రహించారు. విద్యార్థులపై చదవాలనే ఒత్తిడి పెంచారు. ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి, రాత్రి పది గంటల వరకు క్షణం తీరిక లేకుండా క్లాసులు, స్టడీ అవర్స్‌తో విద్యార్థులు కుస్తీ పడుతున్నారు, ఒత్తిడికి గురౌతున్నారు. డే-స్కాలర్స్‌గా ఉండే పిల్లలు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు ఆ పాఠశాలలోనే గడపాలి. ఎపిలో విద్య పూర్తి స్థాయి లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. ముఖ్యంగా గడిచిన రెండు దశాబ్దాలలో ఈ ధోరణి పెరిగింది. మొదటి దశలో 'ఎంసెట్ లాంటి

మొగ్గలోనే చిదిమేయకండి

తల్లిదండ్రుల బలహీనత ఆధారం చేసుకొని ఆరవ తరగతి నుండే ఐ.ఐ.టి బోధిస్తామని కొన్ని పాఠశాలలు ప్రచారం చేసుకోవడం చూస్తున్నాము. ఈ సందర్భంలో తల్లిదండ్రులు గుర్తించవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి.

◈ ఇంజినీరింగ్, మెడిసిన్ తోపాటు సమాజానికి అవసరమైన అనేక వృత్తులు, వాటికి సంబంధించిన కోర్సులు ఉన్నాయి.

◈ కార్పొరేటు విద్యాసంస్థల్లో చదివినంత మాత్రాన సీట్లు రావు. అనేక మంచి ప్రభుత్వ విద్యాసంస్థలు కూడా ఉన్నాయి. (ఉదా: ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలలు, నూజివీడు ట్రిపుల్ ఐటి వంటివి)

◈ పిల్లల్లో ప్రతిరోజూ కొంత సమయాన్ని గడపండి. వారు పాఠశాల నుండి వచ్చిన తరువాత చెప్పే కబుర్లు సరదాగా వినండి.. అనుకూలంగా స్పందించండి.

◈ ఒక్కరే పిల్ల వున్న తల్లిదండ్రులు కూడా పిల్లలు ఎంజాయ్ చేయాల్సిన కాలంలో దూరంగా కార్పొరేట్ పాఠశాల హాస్టల్‌లో చేర్పించడం సరైనదేనా?

◈ మీరు టి.వి.లో సీరియల్స్ చూస్తూ పిల్లాడిని పక్కగదిలో చదువుకోమనడం అన్యాయం. మంచి కార్యక్రమాలను వారితో కలిసి చూడండి. పిల్లలు చదువుకొనే సమయంలో టి.వి. ఆఫ్ చేయండి.

◈ పిల్లలకు జనరల్ విషయాలు చెప్పండి. పేపర్ చదవనివ్వండి, ప్రపంచంలో జరుగుతున్న విషయాలు వారితో చర్చించండి.

◈ మీ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చకండి. ప్రపంచంలో ఏ ఇద్దరు పిల్లల ప్రజ్ఞ ఒకే విధంగా ఉండదు. పిల్లలకు ఆసక్తి వున్న అంశాలలో ప్రోత్సహించండి.

చదువంటే...



విద్య లక్ష్యం ఏమిటి? ప్రముఖ తత్వవేత్త అరిస్టాటిల్ అభిప్రాయంలో 'రాజ్యానికి అవసరమైన మంచి పౌరులు విద్య ద్వారా మాత్రమే రూపొందుతారు". విద్య మానవుణ్ని సమగ్ర దృక్పథంతో తీర్చిదిద్దాలి. విద్యను 'ప్రైవేట్ గూడ్'గా కాకుండా 'పబ్లిక్ గూడ్'గా చూడాలి. విద్యపై పెట్టే ఖర్చును ప్రభుత్వాలు 'సామాజిక పెట్టుబడి'గా భావించాలి. ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా విద్యారంగంలో సామాజిక న్యాయాన్ని సాధించవచ్చు. కుల, మత, వర్గ, లింగ, ప్రాంతీయ భేదాలు లేకుండా విద్యాపరమైన అవకాశాలు, హక్కులు పౌరులకు కల్పించాలి. విద్య ద్వారా మార్కెట్ మనుషులను కాకుండా సామాజిక మనుషులను తయారుచేయాలి. విద్య ద్వారా మాత్రమే మానవాభివృద్ధి సాధ్యమవుతుంది. ఉదాహరణకు కేరళ. ప్రముఖ విద్యావేత్త లార్డ్ బ్రూగమ్ "అక్షరాస్యులైన ప్రజలను అణచివేయడం, ప్రజల పట్ల నిరంకుశ విధానాలను అవలంబించడం కష్టం" అని పేర్కొన్నారు.

"విద్య అనే వృక్షం వేళ్లు చేదుగానూ, ఫలాలు తియ్యగానూ ఉంటాయి" **– అరిస్టాటిల్**

"భారత జాతి భవిష్యత్తు తరగతి గదిలో నిర్ణయించబడుతుంది" **- కొఠారి కమిషన్**

"అణచివేతకు గురైన వర్గాల విముక్తి రాజ్యాధికారం, సమాన అవకాశాలు విద్యతోనే సాధ్యం"

– డాక్టర్ బిఆర్ అంబేద్కర్

"ఆధునిక భారత దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ నిర్మాణం ఆధునిక విద్యతో సాధించవచ్చు"

- జవహర్‌లాల్ నెహ్రూ

రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు, రెండవ దశలో ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి. వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలను 'ఎర'గా వేసి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. 6వ తరగతి నుండే ఐ.ఐ.టి పరీక్షలకు బోధిస్తామని మార్కెట్‌ను సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని పాఠశాలలు 9వ తరగతిలోనే ఇంటర్ ఫిజిక్స్ సిలబస్ చెప్పడం విద్యార్థులపై ఎంత ఒత్తిడి తెస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఆడేందుకు చోటేది

కార్పొరేట్ పాఠశాలలు 90శాతం అద్దె భవనాలలో, అపార్ట్‌మెంట్లలో నడుపుతున్నారు. క్రీడామైదానాలు ఉండవు ఆటలు ఉండవు. డ్రాయింగ్ పాటలు, క్విజ్‌ల వంటివి ఇతర కార్యక్రమాలు ఉండవు. పిల్లలను బట్టీపట్టే యంత్రాలుగా మార్చేస్తున్నారు. సృజనాత్మకమైన ఆలోచనలకు గాని, అభిరుచులకు గాని అవకాశంలేదు. ఫలితంగా వందలాది మంది విద్యార్థులు మానసిక సంక్షోభాన్ని, ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ విద్యా వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో విద్యా నిర్వచనాన్ని సైతం మార్చేసింది. వీరి పాఠ్య ప్రణాళికలు, బోధన విధానాలు, మూల్యాంకన, పిల్లల పట్ల దృక్పథం, సెక్షన్లు ఏర్పాటు చేసే తీరు, ఈ అంశాన్ని పిల్లలపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. కార్పొరేట్ విద్య డిక్షనరిలో "పిల్లల వికాసం, సృజనాత్మకత, సమగ్రత, జ్ఞానసముపార్జన' అనే పదాలకు తావులేదు. ఇన్ని ఒత్తిళ్లల్లో పిల్లల బాల్యం చితికిపోతుంటే ఇక వారికి బంగారు భవితెక్కడి నుంచి వస్తుంది.

సివిల్స్ ర్యాంకుల్లోను...

ప్రపంచీకరణ నేపథ్యంలో మానవుల ఆకాంక్షలు పెరిగాయి. తమ పిల్లలు కూడా ఇతర దేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కార్పొరేట్ విద్యాసంస్థలు కోచింగ్, ర్యాంక్‌లతో తల్లిదండ్రులను ఊదరగొట్టేస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రకటించే ర్యాంక్‌లపై ఎటువంటి తనిఖీ లేదు, ప్రభుత్వ నియంత్రణ లేదు. ఇటీవల సివిల్స్‌లో 3వ ర్యాంక్ సాధించిన గోపాలకృష్ణ సాధారణ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివినవాడు. సివిల్స్ పరీక్షలు (మెయిన్స్) కూడా తెలుగు మీడియంలో రాశాడు. అతడిని తమ అభ్యర్థిగా రెండు కార్పొరేట్ విద్యాసంస్థలు పేపర్లో ప్రకటించుకుంటే ప్రశ్నించినవారే లేరు.

తల్లిదండ్రులు పిల్లల ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా చదివిస్తే, ఒత్తిడికి గురికాకుండా ఉంటారు. పిల్లలు క్రీడలు, ఆటలు, పాటలు మొదలైన వాటిల్లో పాల్గొనే విధంగా ప్రోత్సాహించాలి. ఎటువంటి పాఠశాలల్లో 'సమగ్ర విద్య' అందుతుందో పరిశీలించాలి. ప్రతిరోజు కొంత సమయాన్ని వెచ్చించి పిల్లలతో గడపాలి. బట్టీ విధానం, గ్రేడ్‌లు, మార్కుల ప్రాధాన్యత ఇవ్వకుండా, విషయపరిజ్ఞానం, విశ్లేషణాసామర్థ్యం, సమగ్ర దృక్పథం కల్పించే పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యారంగం సృజనాత్మకమైనది. గాంధీ, అరబిందో, వివేకానందుడు, రవీంద్రనాథ్‌ఠాగూర్, జిడ్డుకృష్ణమూర్తి, గిజుభాయ్ వంటి అనేకమంది విద్యారంగ సృజనాత్మకతను విద్య గొప్పతనాన్ని వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగ తాత్వికతను వివరించారు. వారి ఆలోచనల ఆధారంగా అందరికీ సమగ్రమైన విద్య కోసం ఒక బలమైన ఉద్యమాన్ని పౌరసమాజం నిర్వహించాలి. దీనిలో విద్యావేత్తలు, విద్యా నిపుణులు, సామాజిక కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి.

ప్రభుత్వాల బాధ్యత

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుటికి అక్షరాస్యత 67 శాతం మాత్రమే ఉన్నది. ఒకటవ తరగతిలో 100 మంది పిల్లలు చేరితే పదవ తరగతి వచ్చేసరికి 26 మంది బడి మాని వేసే పరిస్థితి నెలకొంది. డ్రాపౌట్స్ రేట్ 26 శాతంగా వుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రైవేట్ విద్యను కాకుండా ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన అవసరం వుంది. రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కార్యక్రమాన్ని విరమించుకోవాలి. అదే విధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలను నియంత్రించే విధంగా, ఫీజులను నియంత్రించే విధంగా చట్టం చేసి అమలుపరచాలి. ప్రైవేట్ విద్యాసంస్థలకు సౌకర్యాలు లేనప్పటికీ అనుమతులు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలి. తల్లి, తండ్రులకు జవాబుదారీతనంగా ఉండాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ర్యాంక్‌లపై సామాజిక తనిఖీ జరగాలి. ✦

నీటి రుచిమరిగి...

ఒకప్పుడు రైళ్లలో ఊళ్లు తిరుగుతున్నపుడు స్టేషన్‌లో బండి ఆగగానే నీళ్లు నింపుకునేందుకు గబాల్న దిగిపోయేవాళ్లు కనిపించేవాళ్లు. తీరా అంత కష్టపడీ తెస్తే ఈ స్టేషన్‌లో నీళ్లు బాగుండవ్... వచ్చే స్టేషన్‌లో అయితే కొబ్బరి నీళ్లలా తీయగా ఉంటాయ్ అని పక్కనోళ్లు అనడం గుర్తుంటుంది. ఇప్పుడైతే మినరల్ వాటర్ ప్లాంట్‌లతో నీటి రుచే తెలీడం లేదు. ఒక్కో ఊరి ఫ్లేవర్ తట్టడం లేదు. నీళ్లేంటి.. వాటికి రుచేంటి.. దాహమేస్తే గొంతు తడుపుకోవాలి కానీ అనమాకండి... మార్టిన్ రీజ్ అనే పెద్దాయనకు కోపాలొచ్చేస్తాయి. ఆయనకే కోపాలు తాపాలు ఎందుకు వచ్చేస్తాయంటే ఆయన వృత్తి వాటర్ సొమ్మెలీర్. అంటే నీటి రుచిని పసిగట్టే వాడన్నమాట. సొమ్మెలీర్ వృత్తి సాధారణంగా వైన్ ఇతర బేవరేజీల ఉత్పత్తి సంస్థల్లో కనిపిస్తుంది. జర్మన్ సంతతి వాడైన రీజ్‌కు నాలుగేళ్ల నుంచే నీటి రుచి తెలిసిందట. అతని తల్లిదండ్రులు ఆతిథ్య రంగంలో పనిచేయడంతో యూరప్ అంతా రీజ్‌ను వెంటేసుకుని తిప్పేవాళ్లంట. ఊరు మారగానే రీజ్ చేసే మొదటి పని అక్కడి స్థానిక కుళాయి నీళ్లు రుచి చూడటమే. నీటిలోని ఖనిజాలు, లవణాల్లో ఉండే కాసింత మార్పు చేర్పులే దాని రుచిని మార్చివేస్తాయనే విషయం గమనించడంతో పాటు ఆ తేడాల్ని తన నాలుక తేలిగ్గా కనిపెట్టేస్తుందనే ప్రత్యేకతను గుర్తించాడు. 2010లో జర్మన్ మినరల్ వాటర్ ట్రేడ్ అసోసియేషన్ నుంచి సర్టిఫికెట్ పొంది తన సేవల్ని అందించడం మొదలెట్టాడు. అతడి సేవల్ని ప్రత్యేకంగా గుర్తిస్తూ అమెరికా 0-1 స్పెషల్ పర్మిట్ వీసాను కూడా ఇచ్చింది. ఇంతా చేసి ఇతగాడి పనితనం ఎక్కడ ఉపయోగపడుతుందా అనుకుంటున్నారా! బాగా డబ్బునోళ్లు మినరల్ వాటర్‌ని హిమాలయాలు, ఆల్ప్స్ పర్వతాలు, లేదా నార్వే దగ్గరలోని గ్లేసియర్ల నుంచి బాటిళ్లలో పడగట్టించుకుని తాగుతుంటారు. కొన్ని కంపెనీలైతే భూమికి 5000 అడుగుల లోతు నుంచి భూగర్భ జలాల్ని తాజాగా అందిస్తుంటాయి. ఇవే కాదు నీటి బుగ్గలు, ఎవరూ చేయి పెట్టని సరస్సుల నుంచి కూడా కాస్ట్‌లీగా నీటిని ప్యాక్ చేసేస్తుంటారు. వీటిలోని ఖనిజాలు కరిగిన శాతం (టీడీఎస్) ప్రకారం వాటి రుచి, ప్రత్యేకత, ఆరోగ్య ప్రమాణాలుంటాయి. వాటి ధర లీటర్‌కు వందలు, వేలల్లోనే ఉంటుంది. మరి అంత గిట్టుబాటయ్యే యాపారమాయే.

వింత లోకం

తాగితే కొనలేరు

తప్పతాగితే ఇంకేం తెలుస్తుంది జేబు ఖాళీ అయ్యేంత వరకు ఏదో ఒకటి కొనేస్తుంటారు... అవసరమున్నా లేకున్నా. సరే జేబులో ఎంతుంటాయిలే అనుకుంటే తెగ తాగి ఇష్టమొచ్చినట్టు క్రెడిట్, డెబిట్ కార్డులను గీకి పడేస్తున్నారని తెలిసింది యూకేకు చెందిన కన్సల్టెన్సీ కంపెనీ ఐబీ ట్సేకి. అకౌంట్‌లో సర్వమంగళం కానిచ్చే బ్యాచ్ ఎక్కువై తీవ్ర కష్టాలు పడుతున్న కుటుంబాల సమస్యకు ఎలాగైనా పరిష్కారం చూపాలనుకుంది ఆ సంస్థ. 'డ్రంక్‌పే' అనే ఓ తెలివైన యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.
ఫోన్‌కు అటాచ్ అయ్యే బ్రీత్ అనలైజరో లేదా చేతికి వేసుకునే బ్రేస్‌లెట్ రూపంలోనో మద్యం స్థాయిని గుర్తించి క్రెడిట్, డెబిట్ కార్డులకు, ఆన్‌లైన్ లావాదేవీలకు లాక్ వేసేస్తుంది. డోసు మరీ ఎక్కువైతే 12 గంటలపాటు భారీగా ఏమి కొనలేకుండా చేస్తుంది. క్యాబ్, ఫుడ్ తదితర ముఖ్య విషయాలకు సరిపడే డబ్బు వ్యవహారాల్ని నడిపించొచ్చులెండి. అలాగే కొందరు ఎంత వరకు తాగితే సాధారణంగా ఉండగలుగుతారో ఆ లెవల్‌కు కూడా యాప్‌ను సెట్ చేసుకోవచ్చు. మరీ తప్పతాగి పడిపోతే హెల్ప్ మీ ఔట్ ఫీచర్ ద్వారా క్యాబ్‌ను దానికదే బుక్ చేసి నేరుగా ఇంట్లో పడేస్తుంది. మంచి ఆలోచనే కానీ కొందరికి తాగితే తెలివితేటలు బాగా పెరిగిపోతాయి. బ్రీత్ అనలైజర్లో వాళ్లు కాకుండా పక్కనోడితో ఊదించి మరీ అకౌంట్‌లు ఖాళీ చేయించుకునే రకాలుంటాయి. దీని గురించి కూడా ఏదో ఒక ఆలోచన చేసే ఉంటుందిలెండి 'డ్రంక్‌పే'. ప్రస్తుతానికి... ప్రతి బ్యాంకు వినియోగదారునికి ఉచితంగా తమ యాప్‌ను అందించాలని స్థానిక బ్యాంకులతో చర్చిస్తోంది ఐబీ ట్సే. యూకేలో ఏమోగానీ ఇండియాలో మాత్రం చాలా అవసరమేమో.

పలకరింత కలవరింత



ఈమెకి మనుషులు అస్సలు గిట్టరు. నలుగురిలో కలవడం కాదు కదా పలకరింపుగా చూడటం కూడా పెద్ద చిరాకు. అందుకే ఓ ఆలోచన చేసింది. బయటవాళ్లకే కాదు ఇంట్లో వాళ్లకు కూడా తనకు చూపు పోయిందని అబద్ధం చెప్పింది. అప్పటి నుంచి ఎవరు ఎదురు పడినా హాయ్‌లు, హౌఆర్‌యూలు, అరనవ్వులు ఏమిలేవు. హవ్వ... ఎదుటి వాళ్లను ఎక్కడ పలకరించాల్సొచ్చిద్దోనని అంధురాలని అబద్ధమాడేసి బతికేస్తోందా అని ఆశ్చర్యపోకండి. ఇలా ఓ నెలో ఏడాదో కాదు ఏకంగా 28 ఏళ్ల నుంచి నెట్టుకొచ్చేసింది.. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌కు చెందిన కార్మెన్ జిమెనెజ్. అప్పుడప్పుడు ఐమూలగా టీవీ చూసినపుడు, పర్‌ఫెక్ట్‌గా మేకప్ వేసుకున్నపుడు ఇంట్లోవారికి అనుమానం వచ్చేది. ఈ మధ్యే తనకు తానే విషయం బయట పెట్టేసరికి నోరెళ్లబెట్టేశారు. కొసమెరుపేంటంటే తను అంధులకు అందే ప్రభుత్వ పథకాల్ని, సేవల్ని ఎంచక్కా వినియోగించుకుంటోందట. ఈ విషయంలో మాత్రం చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కార్మెన్ చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది. అయినా నవ్వుతూ పలకరిస్తే నీ సొమ్మేం పోతుందమ్మా... అని విసుక్కుంటోంది కుటుంబం. మూడు దశాబ్దాలు ఇలా అంధురాలిగా నటించడం చిన్న విషయమేం కాదు... అసలు తనకు తానుగా ఆ విషయం చెప్పకపోతే అస్సలు తెలిసేదే కాదు... ఇదో గొప్ప ఫీట్... హా..శ్చర్యపోతూ చప్పట్లు కొడుతున్నవాడూ ఉన్నారులెండి. ఇన్ని తిప్పలు పడలేం కానీ హాయిగా 'హాయ్..!' చెప్పేద్దాం.

మూడో వ్యోమగామి

అంతర్జాతీయ పరిశోధనలకు వ్యోమగామిగా ఎంపికైన మూడో భారత సంతతి మహిళగా అరుదైన అవకాశాన్ని అందుకుంది షాన్నా పాండ్య. జనరల్ ఫిజీషియన్‌గా అమెరికాలో సేవలందిస్తున్న తను ఒక తైక్వాండో చాంపియన్. మావ్ థాయ్‌లో శిక్షణ పొందడంతో పాటు మరిన్ని రంగాల్లో ఆరితేరిన ఆ మహిళ మరెవరో కాదు మన భారత సంతతికి చెందిన అమ్మాయే. సాహసోపేతమైన రంగాల్లో రాణించడమే కాదు సాహస యాత్రలు, పరిశోధనలు, ప్రసంగాలు చేస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ ధీశాలి పరిచయం మీ కోసం....

కెనడాలో పుట్టిపెరిగిన షాన్నా పాండ్య(32)కి సాహసాలు చేయడమంటే ఇష్టం. చిన్నతనం నుండే ఈ అలవాటు తనలో బలపడింది. యూనివర్సిటీ ఆఫ్ అల్బర్టాలో బిఎస్సీ చదువుతున్న రోజుల్లో స్పేస్ సైన్స్‌పై ఇష్టాన్ని పెంచుకున్నారు పాండ్య. గ్రాడ్యుయేషన్ తర్వాత ఇంటర్నేషనల్ స్పేస్ యూనివర్సిటిలో ఎమ్మెస్సీ స్పేస్ సైన్స్‌లో చేరారు. దాంతోపాటుగా అదే యూనివర్సిటిలో మెడిసిన్‌లో ఎమ్‌డిని కూడా పూర్తిచేశారు. ఇలా రెండు విభిన్న రంగాల్లో ఆరితేరడం తనలోని విలక్షణతని చాటిచెప్పే అంశం. అంతేకాదు ఫ్రెంచ్, స్పానిష్, రష్యా భాషల్లో పట్టుసాధించారు. వైద్య రంగంతోపాటు సాంకేతికరంగం, విజ్ఞాన శాస్త్రంలో కొత్త ఆవిష్కరణలు, సామాజిక అభివృద్ధి ఇలా ఎన్నో విషయాలపై దృష్టిసారించేవారు. స్పేస్ సైన్స్‌తోపాటు వైద్య వృత్తిలో కొనసాగాలనేది తన చిన్ననాటి కల. ప్రస్తుతం కెనడాలో జనరల్ ఫిజీషియన్‌గా సేవలందిస్తూ టెడెక్స్ స్పీకర్‌గాను కనిపించారు. కొరియాకి చెందిన మార్షల్ ఆర్ట్ తైక్వాండోలో అంతర్జాతీయ చాంపియన్‌గా నిలిచారు. మ్యూజిక్ అంటే ఇష్టపడే తనకి ఒపేరాలో పాడే అవకాశం రావడం ఆనందాన్ని కలిగించే విషయం. నిజానికి తను సింగర్ కాదు. అయితే ఒక రోజు అనుకోకుండా ఒపేరా స్టేజ్‌పై పాడే అవకాశం వచ్చింది. అరుదుగా లభించిన ఆ అవకాశాన్ని వద్దనలేక గొంతుకలిపారట. కొరియాకి చెందిన మార్షల్ ఆర్ట్ మౌవే థాయ్ క్రీడలో యుఎస్ నావీ సీల్ ద్వారా శిక్షణ తీసుకున్నారు. సాంకేతిక ఆవిష్కరణలో భాగమయ్యే ఆలోచనతో తన ప్రయాణం మొదలయ్యింది. 2009లో సొంతగా సివిగార్డ్ అనే కంపెనీని ప్రారంభించారు. అత్యవసర సమాచారాన్ని అందించే ఒక మొబైల్ కమ్యూనికేషన్ సంస్థ ఇది. టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పం తనది. తన కృషి ద్వారా పది సంవత్సరాల్లో వందకోట్లమంది సాంకేతికతను అందుకోగలిగారు. ఇటీవల నాసా స్పేస్ మిషన్‌లో భాగంగా సిటిజన్ సైన్స్ ఆస్ట్రోనాట్ (ప్రోగ్రామ్(సిఎస్ఎ)కి అభ్యర్థులని ఎంపిక చేసింది. శిక్షణ అనంతరం ఈ స్పేస్ మిషన్‌కి దాదాపు 120 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వాళ్ళలో షాన్నా పాండ్యా ఒకరు. వైద్య శాస్త్రం, బయో మెడిసిన్‌లో ఆరితేరిన పాండ్యా వాతావరణంలోని మేసోస్పియర్‌పై భాగంలో వుండే పోలార్ సబ్ ఆర్బిటల్ సైన్స్(పిఎఎస్ఎయుఎమ్)లో వచ్చే మార్పులపై నిర్వహించనున్న పరిశోధనల్లో పనిచేయనున్నారు. భూభాగం నుండి దాదాపు 31మైళ్ళ ఎత్తున వుండే ప్రాంతమే ఈ మెసోస్పియర్. మనిషి మనుగడకి సంబంధించిన మానసిక, ఆరోగ్య విషయాలతోపాటు భూ అల్ప గురుత్వం వద్ద పర్యావరణ మార్పులపై పరిశోధనలని నిర్వహించనున్న ప్రాజెక్ట్ ఇది. భూమండలాన్ని దాటి ఇతర కక్ష్యల్లో ప్రవేశించాలనే మనిషి నూతన ఆలోచన, ఆశయానికి ఇలాంటి అధ్యయనాలు మరింత ఆయువు పట్టునివ్వనున్నాయి. 2018లో ప్రారంభం కానున్న (పిఎఎస్ఎయుఎమ్) ప్రాజెక్ట్‌లో ఒక మహిళ ఎంపికవ్వడం ఇదే తొలిసారి. నిజానికి ఇది ఒక సాహసోపేతమైన ప్రయాణమనే చెప్పుకోవాలి. అయితే తన చిన్ననాటి కలని నిజం చేసుకోవడానికి ఇదో మంచి అవకాశం అంటారు పాండ్య. ఇప్పటికే ఫ్లోరిడాలో నిర్వహిస్తున్న యాక్వేరియస్ స్పేస్ రీసెర్చ్ ఫెసిలిటిలో భాగమయ్యారు. నీటి అడుగున నిర్వహించే ఈ పరిశోధనల్లో ప్రధాన సిబ్బంది సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి సాహసోపేతమైన అధ్యయనాలకి తన కుటుంబ ప్రోత్సాహం కూడా తోడయ్యింది. జీవితంలో మనం సాధించే విజయాలు కొత్త అధ్యయనాలకి తోడ్పడతాయి. ప్రేరణని ఆశయాన్ని పెంచుతాయి. అలా తను నేర్చుకోవాల్సినవి ఇంకా చాలానే వున్నాయనేది పాండ్య అభిప్రాయం. అలాంటి పాండ్య స్ఫూర్తి నేటితరం పొందాలి.

అనుబంధం.. ఆత్మీయత.. అంతే..?

'తాత - మనవడు' చిత్రకథ ఎలా పుట్టింది? అప్పటికే దాసరి రచయితగా మంచిపేరు తెచ్చుకున్నాడు. దాసరిని ఆదరించిన మొదటి వ్యక్తి ఎస్ భావనారాయణ 'అందం కోసం పందెం' యస్.యస్. భట్ ముగ్గురు నిర్మాతల సారధ్యంలో 'జగత్‌జంత్రీలు', జగజ్జట్టీలు ఇత్యాది క్రైమ్ చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఈ చిత్రాలకు రచయిత దాసరి నారాయణ......దాసరి గారి ప్రతిభను గుర్తించి బి.వి ప్రసాద్ మొట్టమొదటి సారిగా మహమ్మద్ బీన్ తుగ్లక్ చిత్రాన్ని నిర్మించాడు. ఇందులో నాగభూషణం రమాప్రభలు ప్రధాన పాత్రలు ధరించారు. రచయితగా దాసరి అద్భుతమైన ప్రయోగాలు చేశాడు. ఇప్పుడు మనం గొప్పగా చెప్పుకుంటున్న 'పంచెస్' ఆ రోజుల్లోనే పేల్చాడు. రచయితలంటే ప్రొడ్యూసర్ రాఘవకి ఒకవిధమైన గౌరవం ఉంది. ఎందుకంటే క్రియేటర్‌గనుక. దాసరిని పిలిచి "మంచి కథ చెప్పి ఒప్పించు సినిమా చేద్దాం!" అన్నారు. ఇక ఉదయం నాలుగ్గంటల నుంచి రాత్రి పదిగంటల వరకు కథలు వినిపించడమే ఎన్ని కథల్ని వినిపించినా రఘువ పెదవ్విరిచేసేవారు. ఒక శుభముహుర్తాన 'తాతమనవడు' కథ వినిపించాడు. అది పిచ్చపిచ్చగా నచ్చేసింది. 'బడ్జెట్ కంట్రోల్లో వుండాలి. ఖర్చుపెట్టే ప్రతిపైసా తెరమీద కనిపించాలి. నాక్కోపం వస్తే మనిషిని కాను. తిడతాను కొడతాను. వీటన్నింటికి సమ్మతిస్తే సినిమా చెయ్యి నేను పెట్టింది తిను! నేనిచ్చింది తీసుకో! మూడోవ్యక్తితో మనకు సంబంధం లేదు. కథను మెరుగుపరుచుకో!' అంటూ దాసరి భుజం తట్టారు.

'తాతమనవడు' చిత్రంలో తొలుత హీరో శోభన్‌బాబు ఈ విషయం చాలా మందికి తెలీదు. స్వయంగా ప్రతాప్ రాఘవగారు చెప్పిన ఉదంతమిది! ఏ కాంబరేశ్వరరావు ప్రతాప్ రాఘవలకి శోభన్‌బాబు అంతకుముందు చిత్రాలకు పనిచేసిన అనుభవం ఉంది. అందుకని ప్రతాప్ రాఘవ అడగ్గానే సెట్స్ ఎలాట్ చేయడం జరిగింది. తీరా ఒక కొత్త దర్శకుడితో చిత్రం నిర్మిస్తున్నారని తెలిసి సున్నితంగా తిరస్కరించాడు. దాంతో రాఘవ మండిపడిపోయి "నువ్వుకాకపోతే మరొకడు. ఒక కోతిని పెట్టి సినిమా తీసే దమ్ము నాకుంది అని ఛాలెంజ్ చేసి టి.నగర్ నార్త్‌బోగ్‌రోడ్‌లో వుంటున్న రాజబాబుని సంప్రదించారు. రాజబాబుకి మతిపోయింది. ఎగిరి గంతేసి మరీ ఒప్పుకున్నారు. తర్వాత చాలాకాలం ఈ విషయంలో శోభన్‌బాబు ఫీలయ్యేవారు. దాసరిని ఆప్యాయంగా 'బావా' అంటూ పిలిచే హీరో శోభన్‌బాబు ఒక్కరే! అలా శోభన్‌బాబు మిస్సయ్యారు రాజబాబు జాక్‌పాట్ కొట్టారు.

విజయనిర్మల నటించడం కృష్ణచలవే! అప్పటికి విజయనిర్మల మంచి స్వింగ్‌లో ఉంది. రాజబాబు పక్కన డీ-గ్లామరైజ్డ్ పాత్ర పోషించేందుకు ముందు తటపటాయించింది. ఈ విషయంలో హీరో కృష్ణ పెద్దమనసు చేసుకొని "ఏమో! రేపు ఈ సినిమానే సిల్వర్ జూబ్లీ జరుపుకోవచ్చు. ఆ క్రెడిట్ మొత్తం నీకే దక్కుతుంది. ఒప్పుకో నిర్మలా!" అంటూ ఒప్పించాడు. విజయనిర్మల శక్తివంచన లేకుండా నటించింది. సినిమాకి ప్రాణం పోసింది.

సామాజిక కథే...

'తాత-మనవడు' సినిమా విషయానికొద్దాం! నిజానికి ఈ సినిమాకి హీరో కథే! చిన్న కథా వస్తువు రెండు వాక్యాల్లో చెప్పేశాడు. "ఒక తండ్రి కొడుకుని అడుగుతాడు "అయ్యా.. అయ్యా ఎందుకు గొయ్యి!" అని అడిగితే, మనవడు "మీ అయ్యకిచేసిన ఈ మర్యాద రేపు నీకు చెయ్యాలి కదయ్యా!" అని సమాధానం చెబుతాడు. ఈ చిన్న పాయింట్ తీసుకొని అద్భుతంగా కథ అల్లాడు.

యస్.వి. రంగరావు తండ్రి అంజలి తల్లి సత్యానారాయణ కొడుకు. రాజబాబు మనవడు. రాజబాబు భార్య విజయనిర్మల. సత్యనారాయణ భార్య అహంకారిగా రాజసులోచన. మిగతావి పేడింగ్ పాత్రలు అల్లు. రమాప్రభ. ఛాయాదేవి చంద్రకళ, కొమ్మినేని శేషగిరిరావులు నటించారు. తాత పాత్ర 'యస్వీఆర్'కి బాగా నప్పింది. తొలిరోజు షూటింగులోనే డైలాగ్స్ చెబుతున్నప్పుడు ఈ అబ్బాయికి మంచి భవిష్యత్తుంది అంటూ దీవించాడు ఇదే మాట అంజలీదేవి అంది. ముఖ్యంగా రాజబాబు రమాప్రభలు దాసరిని ఆకాశానికెత్తేశారు మా కాల్షీట్సన్నీ మీకే! అంటూ ఆటపట్టించేవారు. అయితే దాసరి మాత్రం సీరియస్‌గా తీసుకున్నారు. తొలిచిత్రంలో

మధ్యతరగతి జీవితాన్ని కాచి వడబోసి, తనదైన పరిష్కారాన్ని చూపించి, జనాల్ని మెప్పించిన వ్యక్తి దాసరి! తన అర్ధశతాబ్దపు సినీ ప్రయాణంలో..నూటయాభై ఒక్క చిత్రాలకు ప్రాణం పోసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌ని కైవసం చేసుకున్న వ్యక్తి దాసరి! ఆ నూటయాభై ఒక్క చిత్రాలకు పునాది తాత - మనవడు. శతదినోత్సవమూ, సిల్వర్‌జూబ్లీలు జరుపుకున్న ఈ చిత్రం ఒక ప్రత్యేకమైన చిత్రంగా చెప్పుకోవచ్చు.



నటించే తారల్ని ఎలాగైనా తన చిత్రంలో వుండేలా ప్లాన్ చేసేవాడు. ఒక మధ్యతరగతి కుటుంబంలో సగటుమనిషి మనోభావాలకి దర్పణం పట్టాడు. దాసరికి కష్టాలు కన్నీళ్లు తెలుసు. పేదబతుకుల ఆరాటం తెలుసు ఆర్ద్రత తెలుసు. దాన్ని సెల్యులాయిడ్ మీద ఆవిష్కరించడంలో వందశాతం సఫలీకృతమయ్యాడు. విజయనిర్మల తండ్రిగా గుమ్మడి కూడా విజృంభించి నటించాడు సత్యనారాయణ కొంగున కట్టుకున్నా భార్య రాజసులోచన పేట్రేగిపోయి నటించింది. అవతల తల్లి (అంజలీదేవి) చావు బతుకుల మధ్యవున్నా. కాలుకదపలేని పరిస్థితి కడసారి చూపులకు కూడా దయనీయమైన పరిస్థితి! తల్లిచనిపోతుంది. డా.సి.నారాయణరెడ్డి రాసిన 'అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం..........తృప్తికై మనుషులు ఆడుకొనే నాటకం వింతనాటకం!' అని పల్లవిని రాస్తూ చరణంలో ఒకచోట 'కానివారి ముచ్చటకై కలవరించు మూర్ఖునికి కన్నవారి కడుపుకోత ఎన్నడైనా తెలిసేనా? తారాజువ్వల మొగుల తలదిరిసిని ఉన్నాదికి - చితిమంటల చిటపటలు వినిపించేనా?'... "ఈ చరణం ప్రేక్షకుల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఏడ్పించింది. ఈ సినిమా చూసిన ప్రతి తండ్రీ..ప్రతికొడుకూ కనెక్టయ్యారు. చాలామంది తాత మనవడు చిత్రం చూసి, దూరమైన తల్లిదండ్రులను ఇంటికి రప్పించుకుని పశ్చాతాపంతో



క్షమాపణలు చెప్పారు. ఆ రోజుల్లో ఎక్కడచూసినా ఇదే చర్చ! ఎవరో కొత్త దర్శకుడు.సినిమా బ్రహ్మాండంగా తీసేడట. ఇక దాసరి ప్రభ మొదలయ్యింది!

హాస్యానికి కొదవలేదు

దాసరి సీరియస్ స్క్రిప్ట్ ఎంత బాగా రాయగలడో హాస్యం కూడా అంతగొప్పగా పండించగలడు. రాజబాబు విజయనిర్మల గుమ్మడి రమాప్రభల మీద కావాల్సినంత కామెడీ పండించారు. ఇందులోనే ఒకపాట వుంది సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని, ఆది వీడికి పేరేది? పుట్టేవారికి చోటేది? ఇదీ పాట ఆ రోజుల్లో ఫ్యామిలీ ప్లానింగ్ ఉద్యమం.. మహోద్యమమై సాగుతున్న వేళ. అన్నింటిని మించి ఈ పాట ప్రచారానికి ఉపయోగపడింది. దాసరి సినిమాలో అంతర్లీనంగా సందేశం వుంటుంది. పండుటాకుల్లాంటి పెద్దల్ని గౌరవించమని వారిని అలక్ష్యం చేస్తే! రేపు వీరి గతీ ఇంతేనన్న సందేశం! ఈ సందేశానికి ప్రాణం పోశారు యస్వీరంగారావు.

కృష్ణ ప్రోత్సాహం!

ఇటీవల కృష్ణ దాసరిని కలిసినప్పుడు.. గత పుట్టినరోజు సందర్భంగా దాసరి మాట్లాడుతూ కృష్ణ నన్ను మొదట్నించీ ఎంతో ప్రోత్సహిస్తూ వస్తున్నారు. నిర్మలగారి విషయంలోనూ సినిమా ఫస్ట్ కాపీ చూశాక ప్రతాప్ రాఘవతో ఒకటే మాటన్నారు. 'రాఘవా! ఈ సినిమా సిల్వర్ జూబ్లీ ఆడుతుంది చూడు కావాలంటే నేను రాసిస్తాను!' అన్నాడు అలాగే జరిగింది. సినిమా రిలీజైంది. సంచలనం.. వంద రెండొందలు. మూడొందల రోజులాడింది. ఒక కొత్త దర్శకుడికి బ్రహ్మరథం పట్టిన చిత్రం 'తాత మనవడు ఈ చిత్రం వందరోజుల ఫంక్షన్ వాణీమహల్‌లో జరిగింది. ఆ సందర్భంగా దాసరికి ఫియేట్‌కారు తాళం చెవులు అందించారు. దాసరి ఉప్పొంగిపోయాడు. చాలాకాలం ఇంకా పెద్ద కారు కొనుక్కునే స్థోమత వున్నా ఆ కారునే మెంటయిన్ చేశారు. దాసరి రెండవచిత్రం కూడా ప్రతాప్ రాఘవదే. ఆ చిత్రం పేరు 'సంసారం సాగరం!'

ఒక అధ్యాయం ముగిసింది

తెలుగు చలనచిత్ర చరిత్ర ఎవరైనా రాస్తే! అందులో ఒక అధ్యాయం దాసరిది! ఆలోచన దర్శకుడే కెప్టెన్ ఆఫ్ ది షిప్ అని నమ్మే వ్యక్తి చిన్నతారల్ని దర్శకత్వం వహించినా ఒకేలా....పాత్రల్ని పండించేవాడు. షెడ్యూలు కాల్షీట్లు వెయ్యడంలో దాసరి దిట షెడ్యూల్లో నటీనటులంటే ఒళ్లు దగ్గరుంచుకుని పనిచెయ్యాలి. అనుకున్న సమయానికి అనుకున్న పని జరిగిపోవాల్సిందే! 'సర్కస్ రాముడు' చిత్రంలో ఎన్టీఆర్ రావుగోపాలరావుని టీజ్‌చేస్తూ పాడినపాట షూటింగ్ సమయంలో చిన్న ఇబ్బంది కలిగినా దాసరి బ్రేక్ ఇవ్వలేదు. అదీ దాసరికి తన టీమ్ మీదున్న కంట్రోల్. అందుకే మేస్త్రీ అని పిలుస్తుండే వారు. ఆ పేరుమీద సినిమా వచ్చింది కూడా.

దాసరి జీవితం! కోపం వస్తే తాటాకుమంట! ప్రేమ వస్తే ఇంక తట్టుకోలేము. వరాల జడివాన! దాసరి కష్టాల్లో పుట్టాడు. కష్టాల్లో పెరిగాడు కష్టాలనే కాన్వాసు మీద సినిమాలు దర్శకత్వం వహించాడు. ఏదిఏమైనా వందమందికి పైగా శిష్యులు. నూటయాభై ఒక్క సినిమాలు.. ఈశకం దాసరిది అనిపించుకున్నాడు.

- ఇమంది రామారావు

9010133844

ఆకలి వ్యాధికి వైద్యం కావాలి



ప్రతిపూటా ఒక అరుపు నన్ను
నరాలు గుంజిమరీ శాసిస్తోంది.
ఈ రోజైనా ఓ పిడికెడు మెతుకుల్ని మింగమని.
గుక్కెడు నీళ్ళతో
ఆకాశాన్ని కడిగేస్తున్నాను.
నిద్రలేవగానే ఓ ఉన్మాది నన్ను
వికారంగా చూస్తూ
ఎన్నాళ్లిలా బతుకుతావని
ఎగతాళి చేస్తున్నాడు.
ఓ రాయిడ్చికొట్టి
వాడ్ని వాడి వెక్కిరింతల్ని
తరిమేస్తున్నాను.
ముదురెండలో నా ఎముకలు
ఇక నిలబడలేవని
నన్ను హెచ్చరిస్తోంటే
కళ్ళు మూతలు పడుతుంటే
ఆకాశంలో రాబందులు అరుస్తున్నాయి !
నన్ను పొడిచి పొడిచి తినాలని.
ఇంతలో ..కుక్కల అరుపుల నుండి
కాళ్ళకి కబురొచ్చింది..!
ఒంటరిగా వున్న ఆ వీధిచివరి చెత్తకుండీ
విందుకు ఆహ్వానించిందని.
విసిరేసిన ఎంగిలి విస్తర్ల మధ్య
విశ్వాసపు జీవులమధ్య
సగం నిండిన కడుపు
ఎందుకు నీకీ వ్యాధొచ్చిందని ప్రశ్నించింది.
ఆ మాటలకి నవ్వుకుంటు ఏడుస్తున్నప్పుడు
త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపో అని
కుళ్లిన కంపు నన్ను కసిరింది.
ఇంతటి దౌర్భాగ్యం, ఇంత దరిద్రం వుంటూ
ముందుకు నడకను సాగించాలా అని
నా ప్రయాణం నన్ను చీదరించుకుంటుంటే
సమాజం మారేంత వరకూ
ఈ ఆకలి వ్యాధికి
వైద్యం వుండదని
నా నీడ అడుగుల గమ్యానికి
నీతిని బోధించింది

- యం.శబరీష్
9885566388

నే వెనక్కి పోను

ముమ్మాటికీ పోను
వెనక్కి నే పోనేపోను
అమ్మ ముద్దుచేసి జోకొట్టటం
నాకు గోరుముద్దలు తినిపించటం
నాన్న స్పర్శ బలాన్నివ్వటం
కాళ్ళుకొట్టి ఏడిస్తే మారాంచేస్తే
అందరూ నన్ను పలకరించటం
ఇవన్నీ నాకు గుర్తురావచ్చు
అయినా తిరిగి నాకా బాల్యం వద్దు
తెలీనితనాన్ని సాంత్వనగా
అమాయకత్వం అమృతంలా
ఇల్లే విశాల విశ్వంగా

అందరూ నా వారిగా
నేను భ్రమసి ఉండవచ్చు
అన్నీ నాక్కావాలనుకున్న నా బాల్యం
నాకు బహు తృప్తినివ్వవచ్చు
అయినా తిరిగి నాకా బాల్యం వద్దు
ఇప్పుడు నాకంతా అవగతమయ్యింది
నా వారెవరో పరులెవరో
ఈ ప్రపంచాన్ని తమ
కబంధ హస్తాల్లోకి
తీసుకుని శాసిస్తున్నదెవరో
బాగా తెలిసివచ్చింది
అందుకే నే వెనక్కిపోనంటాను
ఇప్పుడు నాతో పాటు
అందరూ బతకాలంటాను
కొందరికే సకల భాగ్యాల్ని
ఇచ్చిన ఈ ప్రపంచాన్ని
నిద్రలోనూ ఈసడించుకుంటాను
అందుకే స్వప్నంలో కూడా
తిరిగి నా బాల్యం నాకొద్దంటాను

-జంధ్యాల రఘుబాబు
9849753298

ప్రాణదాతల రోజు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్‌వో) ద్వారా ఆమోదించబడటంతో కార్ల్ ల్యాండ్‌స్టీనర్ పుట్టిన రోజు జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

- ఆస్ట్రియాకి చెందిన ప్రముఖ వైద్యుడు కార్ల్ ల్యాండ్‌స్టీనర్ మొట్టమొదటగా 1901లో మన శరీరంలో ప్రధానమైన మూడు బ్లడ్ గ్రూప్‌లు ఎ, ఎబి, బి కనుగొన్నారు.

- పెద్దవారిలో రక్తం పది పింట్లుగా వుంటుంది. రక్తం ఇవ్వడం ద్వారా మనం కోల్పోయేది 1పింట్ రక్తం మాత్రమే.
- రక్తదానం చేసిన 56 రోజుల తర్వాత రక్తాన్ని, ప్లేట్ లెట్స్‌ని ఏడు రోజులు, పాస్మా 28 రోజులు, డబుల్ రెడ్ సెల్స్ 112 రోజుల తర్వాత మళ్ళీ అందించొచ్చు.
- మన శరీరం బరువులో రక్తం బరువు ఏడు శాతం.

- మనం చేసే ప్రతి ఒక్క రక్త దానం ద్వారా ముగ్గురు వ్యక్తులని బతికించగలం.
- 'ఒ నెగటివ్' బ్లడ్ గ్రూప్ వారిని విశ్వగ్రహీతలుగా పరిగణిస్తారు. భారత్‌లో 'ఒ నెగటివ్' బ్లడ్ గ్రూప్‌ని కలిగి వుంది ఏడు శాతం మంది మాత్రమే.

- ఆరోగ్యవంతులు 18 - 60 ఏళ్ళ వరకు రక్తదానాన్ని చేయవచ్చు.
- రక్త నమూనాల్ని తీసుకుని హెచ్‌ఐవి, హెపటైటిస్ బి, సి, సిఫిలిస్ వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలని నిర్వహించి అవి లేకుంటేనే రక్తదాతల నుంచి రక్తం తీసుకోబడుతుంది.



- ప్రమాదం తలుపు తట్టాక ఏం చేయగలం అందుకే 'రక్తదానం చేయండి... ఇప్పుడు....అప్పుడప్పుడూ' అనే నినాదంతో 2017 ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- ప్రతి సంవత్సరం మన దేశంలో ఐదు కోట్ల యూనిట్ల రక్తం అవసరముంది. అందులో అత్యధికంగా లభ్యమవుతోంది 2.5 శాతం మాత్రమే.
- ఒక ఏడాదిలో గరిష్టంగా 24 సార్లు ప్లేట్‌లేట్స్ ఇవ్వవచ్చు.
- 'ఒ' బ్లడ్ గ్రూప్ అన్ని రకాల బ్లడ్ గ్రూపుల వారికి అనుకూలమైనది. అప్పుడే పుట్టిన పిల్లలతోపాటు వ్యక్తి బ్లడ్ గ్రూప్ తెలియని అత్యవసర పరిస్థితుల్లో 'ఒ' బ్లడ్ గ్రూప్‌ని తీసుకుంటారు.



- ప్రపంచ వ్యాప్తంగా 10 కోట్ల 80 లక్షల రక్తదానాలు జరుగుతున్నాయనేది ఒక నివేదిక. అత్యంత సంపన్న దేశాల్లో రక్తదానం శాతం ఎక్కువ.
- దాదాపు 62 దేశాల్లో సేకరిస్తున్న రక్తం 100 శాతం స్వచ్ఛంద రక్తదాతల నుండి స్వీకరించబడుతోంది.
- కార్ యాక్సిడెంట్‌లో గాయపడిన వ్యక్తికి 100 యూనిట్ల రక్తం అవసరపడుతుంది.
- కొన్ని నిమిషాల్లోనే పూర్తయ్యే ప్రక్రియ రక్తదానం.. దీని ద్వారా ఓ ప్రాణాన్ని కాపాడదాం.



కథ

వధ్యశిల

ఆవుల వెంకట రమణ
9494088110

మెన్నీ మధ్య నేను మా సొంతూరెళ్ళాను. సుమారు పదేళ్ల తరువాత సొంతూరికి వెళ్ళానన్న మాట! ఈ పదేళ్ళలో ఒకటీ రెండుసార్లు మా వూరికెళ్ళినా సముద్రం ఒడ్డుకి మాత్రం వెళ్ళలేదు. ఎవరైనా బంధువులో మిత్రులో చనిపోతే ఇలా వెళ్లి అలా వచ్చేస్తున్నాను. అందువల్ల సొంతూరికి పోయి బాల్యంలో గడిపిన ప్రదేశాల్ని తిలకించాలన్న కోరిక బలీయంగా నాటుకు పోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవులు దొరకబట్టి నా శ్రీమతిని వెంట బెట్టుకుని సొంతూరికి బయల్దేరాను.

ఊరు సమీపించే కొద్దీ పుట్టింటికొస్తున్న ఫీలింగ్! ఎక్కడో ఖండాంతరాల ఆవల లేనిప్పుడు. మా ఊరికి 20 కిలో మీటర్ల దూరంలోనే. ఎంతైనా పుట్టిపెరిగిన గడ్డ కదా! మా ఇంటి ముందు కొంత తుంగ గడ్డి మరికొంత చేడు కలిసిన భూముండేది. దాన్ని పర్ర అని పిలిచే వాళ్ళం. వర్షా కాలం ఎలికేరు పొంగి బకింగ్‌హామ్ కాలువ ద్వారా ఆ పర్రలోకి వరద నీరొచ్చేది. అప్పుడు దాన్ని చూస్తే ఓ మినీ సముద్రంలా వుండేది. మా ఇల్లు తూర్పు వరసలో వుండడం మూలాన ఎప్పుడు పర్రలోకి నీళ్ళొచ్చినా బాగా కనబడేవి. అలా వానా కాలం వచ్చిన నీళ్ళు బకింగ్ హామ్ కాలువలోకి పోగా మిగిలినవి ఆ పర్రలోని చిన్న చిన్న గుంటల్లో నిలబడేవి. సరిగ్గా సంక్రాంతి పండగల నాటికి ఆ గుంటల్లో చిన్న చిన్న రొయ్య పిల్లలూ, చేప, ఎండ్రకాయల పిల్లలూ అక్కడే పుట్టి పెరిగేవి. ఎలిమెంటరీ స్కూళ్ళకు సెలవొచ్చిన ఆదివారాల్లో ఇంక మాకు పండగే పండగ!

ఊర్లోని పిల్లలంతా చిన్న చిన్న కొంటాలలు తీసుకుని తాటాకు బుట్టలు తీసుకొని ఆ గుంటలకేసి పరిగెత్తే వాళ్లం. ఆ గుంటల్లో కొంటాల లేసి రొయ్యలూ, చేపలూ పట్టేవాళ్ళం. ఒక్కొక్కసారి అందులోని ఎండ్ర కాయలూ, నీటి పాములూ కరిచేవి. మా ఇంటికీ ఆ పర్రకూ మధ్యన ఇసుక భూములుండేవి. అందులో ఒక సీజన్‌లో పొగనారూ ఇంకో సీజన్‌లో రాగి పంటనూ వేసేవాళ్ళం. ఆ రాగులే మాకు పగటి పూట ఆహారం. అంబలి, జావ, సంగటి ఇలా రకరకాల వంటలు చేసుకుని తినేవాళ్ళం. ఇక పండుగలొస్తే మా ఆనందానికి హద్దులే వుండవు.

ఈ పదేళ్లలో నాకు పట్నంలో సన్నిహితులు గానీ మంచి మిత్రులు గానీ ఎవరూ లేరు. అందరూ ఉద్యోగాలూ వ్యాపారాల నిమిత్తం వచ్చినవాళ్ళే. ఉదయం తొమ్మిదింటికల్లా అందరూ ఉద్యోగాలకూ, వ్యాపారాలకూ వెళ్ళిపోయి సాయంత్రం ఎప్పుడో కానీ ఇళ్లకు చేరేవాళ్ళం. ఇంట్లోకి చేరిన వెంటనే వీధి తలుపులు బిగించి ఎవరి ఇళ్లలో వాళ్లం నూతిలో కప్పల్లా ఆ చిన్న ప్రపంచంలోనే టీవీలతోనో, ల్యాప్‌టాప్ కంప్యూటర్ లాంటి వాటితో మునిగి పోతాం. నిజానికిదో చట్రం. ఇదొక కక్ష్య. అందులోనే పరిభ్రమిస్తూ, పరిభ్రమిస్తూ చివరికేమౌతామో!

○○○

బస్సు ఊరి మధ్యలోకొచ్చి వేపచెట్టు చుట్టూ తిరిగి రామాలయం ముందర ఆగింది. అందరూ దిగిన తరువాత మేమూ దిగి మా ఇంటికెళ్తూ దారిలో వున్న నా ప్రియనేస్తం రాజారావు ఇంటికెళ్లి కనబడి మరుసటి రోజు ఉదయం సముద్ర తీరానికెల్దాం అని చెప్పి మా ఇంటి కొచ్చా. మరుసటి రోజు ఉదయం నిద్రలేచి ఇంటి ముందరుంటే పర్రకేసి చూశాను. అక్కడ మునుపటిలా పచ్చటి తుంగగడ్డి లేదు. అంతా చౌడు పులుముకుని ఎర్రగా బురదలా వుంది. మునుపటిలా సహజమైన గుంటలు లేవు. అదే విషయాన్ని అమ్మనడిగాను. సునామీ వచ్చినప్పుడు

ఆ పర్ర నిండా సముద్రం నీళ్ళు వచ్చాయంట. తర్వాత నీళ్ళైతే పోయాయి కానీ ఆ బురద మాత్రం అక్కడే పేరుకుపోయిందంట! రెండేళ్ళ కిందట ఉపాధి హామీ పథకంలో ఆ తుంగ గడ్డి దిబ్బల్ని కొట్టి పర్రచుట్టూ కట్టేశారని అమ్మ చెప్పింది. గబగబాపోయి ఆ కట్ట మీద నిల్చున్నాను. ఒకనాటి తుంగ గడ్డే కానీ సహజమైన గుంటలు అక్కడలేవు. అంతా పెద్ద పెద్ద మట్టి తీసిన గుంటలే కనిపిస్తు న్నాయి. ఏమైనా ప్రకృతి ప్రకృతే అనుకున్నాను. ఒక్క క్షణం నిట్టూర్చి వెనక్కి వచ్చాను. అమ్మ తెచ్చిన ఇడ్లీల్ని శ్రీమతికిచ్చేసి రాత్రి వండిన సద్దన్నం తిని రాజారావింటికేసి బయలుదేరాను. దారిలోని ఇళ్ళన్నీ వింతగానూ, ఆశ్చర్యంగానూ వున్నాయి. అప్పట్లో అంతా దూలాల ఇళ్ళు. అక్కడక్కడా తాటాకుల గుడిసెలు వుండేవి. మరిప్పుడన్నీ పక్కా ఇళ్ళే! వాటిలో కొన్ని పెద్ద పెద్ద మిద్దెలూ వాటి కప్పుల మీద డి.టి.హెచ్ ఏంటెన్నాలు బిగించి వున్నాయి. నేను ఊరు విడిచేటప్పుడు కేబుల్ టీవీలు మాత్రమే వుండేవి. ఇప్పుడైతే ఇంటింటికీ డి.టిహెచ్ యాంటెన్నాలూ, ప్రతి ఒక్కరి చేతిలో టచ్, యాండ్రాయిడ్ సెల్‌ఫోన్లూ, ఊరి మధ్యలో రెస్టారెంట్, వీధికో టిఫిన్ హోటల్, కూల్ డ్రింక్ షాపులూ! చిన్నప్పటి నుంచే పిల్లలకు రెడీమేడ్ డ్రెస్సులూ...ఓహ్ మా ఊరెంతగా మారిపోయింది!! ఒక్క పదేళ్లలో ఎంత మార్పు!. మార్పు రావడానికి పదేళ్ళు చాలవా?! కాలం నిరంతర పరిణామశీలి కదా! ఆదిమ యుగాల నుంచి మధ్య యుగాల మీదుగా అత్యాధునిక యుగం దాకా కాలం నిరంతరం ప్రవాహశీలి కదా. పాతను తనలో కలుపుకుని కొత్తను జనం మీద రుద్దుతుంది. ఎవరు మారినా మారకపోయినా కాలం తన పాటికి తాను కదులుతూనే వుంటుంది.

ООО

"రాజారావ్" ఇంట్లోకి తొంగి చూస్తూ పిలిచాను. "ఎవరూ" అంటూ లోపల్నుంచి వచ్చింది రాజారావు తల్లి. 'ఓ నువ్వా రా నాయినా" అంటూ లోనికి దారి తీసింది. ఆవిడ గొప్ప సాధ్వీమణి. ఆవిడంటే నాకు చాలా గౌరవం, ఆరాధనా భావం. కన్న కొడుకుతో పాటు నన్నూ సమానంగా ఆదరించింది. చిన్నతనంలో వాళ్ళింటి దగ్గరే నేను ఎక్కువ సమయం గడిపేవాడిని. తన కొడుకుతో పాటు నాకూ అన్నం పెట్టేది. అలా ఎన్నిసార్లు వాళ్ళింటి దగ్గర అన్నం తిన్నానో! ఆ మధుర స్మృతులను నెమరేసుకుంటూ చాలా రోజుల తరువాత ఆ ఇంట్లోకి అడుగుపెట్టాను. వాళ్ళ ఇల్లు కూడా చాలా మారిపోయింది. రాజారావు భార్య పుట్టింటి నుంచి ఎల్‌సిడీ, టీవి, వాషింగ్ మెషిన్, ఫ్రిజ్, కూలర్ లాంటి చాలా వస్తువులు తెచ్చిందంట. ఇల్లంతా ఒద్దిగ్గా అలంకరించబడి వుంది. రాజారావుకి కూడా ఇద్దరు పిల్లలు పట్నంలో చదువుతున్నారని తెలిసింది. రాజారావు ఇంట్లో కూర్చొని అన్నం తింటున్నాడు.

రా... అన్నా రా....కూర్చో... అన్నాడు రాజారావు.

త్వరగా తిని కానియ్‌రా... ఎండబడి పోతుంది చాలా చోట్ల తిరగాలి. అంటూ కుర్చీలో కూర్చొని టీవీ చూస్తున్న పావు గంటలో అన్నం తిని రాజారావు తయారయ్యాడు. ఇద్దరమూ అలా సముద్రానికి దారితీసే రోడ్డు మీదికొచ్చి కొంత దూరం నడిచేసరికి బకింగ్‌హామ్ కాలువ వచ్చింది. ఆ కాలువలో నీళ్ళు లేవు. ఎండిపోయి వుంది. మధ్య మధ్యలో ఎత్తైన మట్టి దిబ్బలూ, చింత చెట్లతో మూసుకుపోయి వుంది. కాలువ పూర్తిగా పూడిపోయి సన్నగా కొద్దిగా ఊట నీళ్ళు పారుతూ పిల్ల కాలువలా వుంది. ఈ కాలువను బ్రిటిష్ వాళ్ళు తవ్వించారు. దీన్ని బకింగ్ హామ్ కాలువ అంటారు. ఆ పేరు వినగానే ఇంగ్లండ్‌లోని బకింగ్‌హామ్

> **అటువంటి వైభవోన్నత వృక్షరాజం ఇవాళ కళింగ యుద్ధంలో గాయపడ్డ క్షతగాత్రిలా ఆకులన్నీ రాల్చుకుని బాహువులొక్కొక్కటినీ ఊడ్చుకుంటూ వధ్యశిల మీద తలవాల్చే బలిపశువులా వుంది. ఆమూలాగ్రం ఎండి పోయి కళావిహీనమై ఎప్పుడెప్పుడు కూలుదామా అని రోజులు లెక్కపెడ్తున్నట్లుంది.**

ప్యాలెస్ గుర్తుకొస్తుంది. కొన్ని వందల ఏళ్ల కిందట దీన్ని తవ్వించారు. కాకినాడ నుంచి మద్రాసు దాకా వున్న ఈ కాలువలో అప్పుడు సరుకులు రవాణా కోసం ఉపయోగించేవాళ్లు. స్వాతంత్ర్యం వచ్చిన పిదప సరుకు రవాణాకు ఉపయోగించుకుంది ప్రభుత్వం. జాతీయ రహదారి-5 పడక ముందు ఈ కాలువ ఒక వెలుగు వెలిగిందట. నిత్యం సరుకు రవాణా పడవల రవాణాతో కోలాహలంగా వుండే దట. రాజమండ్రి, కొవ్వూరు, తణుకు, విజయవాడ, తెనాలి. మొదలైన పట్టణాల నుంచి సరుకుల్ని ఎక్కించి మదరాసు పంపించి అక్కడ్నుంచి మరికొన్నిటిని ఇటువైపుకి తీసుకొచ్చేవారంట. అప్పట్లో ఆ కాలువ పడవల్ని మావాళ్ళే ఎక్కువగా నడిపేవారంట. మాది కూడా ఒక పడవ వుండేదంట. మా నాన్న మా తాత మేనమామలు నడిపేవారంట. అటువంటి ఘన చరిత్ర కలిగిన ఈ కాలువ పూడిపోకుండా అప్పట్లో ప్రతి ఏడాదీ ఎండా కాలం తవ్వించేవారు. నాకు తెలిసినప్పుడు కూడా తవ్వించారు. దాదాపు నలభై ఏళ్ళ క్రితం నుంచే ఈ పూడిక తియ్యడం ఆగిపోయింది. ముప్ఫై సంవత్సరాలప్పుడు పుట్టుకొచ్చిన రొయ్యల కంపెనీలు హేచరీల అత్యాశ వల్ల ఈ కాలువ అస్థిత్వాన్ని కోల్పోయింది. అప్పట్లో ఎండా కాలంలోనే పెద్ద వాళ్లకే భుజాల కింది కొచ్చేవి నీళ్ళు. ఎలికేరు సముద్రంలో కలిసే చోట నుండే సముద్రం నీళ్ళు కాలువలోకొస్తాయి. వానాకాలమైతే ఎలికోటి వరదతో పెద్ద వాళ్లకి కూడా రేవుల్లోనే అందేది కాదు. వానలు ఎర్రమట్టిలో పడడం వల్ల నీళ్ళు ఎర్రగా వుండేవి. ఒక చిన్నపాటి వంతెన మీద కాళ్ళు తడవకుండా అవతలికి చేరుకున్నాం. అవతలి వైపున కాలువ అంచుల్లో కనుచూపు మేరా డీజిల్ ఇంజన్లు పెట్టి వున్నాయి. నాకేమీ అర్థం కాక రాజారావు నడిగాను అవెందుకు పెట్టారని. వాడు అవి రొయ్యల చెరువులకు నీళ్ళు నింపడానికన్నాడు. అంటే కాలువ నుంచి పంపింగ్ చేస్తున్నారా అన్నాను. వాడు ఔనన్నాడు. అసలు కాలువలో నీళ్ల లేవు కదా అన్నాను నేను. అప్పుడప్పుడూ ఏటి పొగరు నుంచి ప్రొక్లైనర్లతో తవ్విస్తున్నారు. అప్పుడు సముద్రం నీళ్ళు వస్తాయని చెప్పాడు. అదే కాకుండా సముద్రం ఒడ్డులో బోర్లు వేసి పంపింగ్ చేస్తు న్నారని కూడా చెప్పాడు. ఇంకొంచెం ముందుకు పోయాము. అక్కడంతా రొయ్యల చెరువులే! ఒక గడ్డి మొక్క కానీ ఒక పచ్చని చెట్టు కానీ చూద్దా మన్నా కనబడలేదు. అంతా ఉప్పునీటి మయమే! రొయ్యలకు కృత్రిమ ఆక్సిజన్ అందించే ఏరేటరల్లను తిప్పడానికుపయోగించే జనరేటర్ల రణగొణ ధ్వని. నా మనసు ఒకింత ఆశ్చర్యానికి గురైంది.

సముద్రానికెళ్ళే దారిలో నిలబడి ఉత్తర దక్షిణ దిశల్లో చూస్తే కంటికి కనిపించేంత దూరం రొయ్యల చెరువులే!

ఇంకొంచెం ముందుకెళ్ళాము. అక్కడో మర్రి చెట్టుండేది. అది ఎలా వుందోననుకుని నాలుగడుగులు ముందుకెళ్ళానో లేదో ఎదురుగా మర్రి చెట్టు కనిపించింది. ఆ దృశ్యాన్ని చూసేసరికి నా కళ్ళు బైర్లు కమ్మాయి. ఆ చెట్టు నీడ వున్నంత పరిధిలో ఏ మొక్క కూడా పెరిగేది కాదు. ఆ చెట్టు నిండా రకరకాల పక్షులు నివాసముండేవి. ఉదయస్తమయ సంధ్యల్లో ఆ పక్షుల అరుపులు కోలాహలంగా వుండేవి. అవి ఒక రాగాన ఆపేవి కావు. ఎండా కాలంలో కొన్ని వందల మంది ఆ చెట్టు నీడలో విశ్రమించేవారు. ఎప్పుడూ ఏ వంద మందో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ వుంటారు. ఎండఝామున పశువులు కూడా ఆ నీడలో పడుకుని చల్లబడగానే లేచి పోయేవి. ఆశ్చర్యం ఏమిటంటే అంత పెద్ద చెట్టైనా ఒక్క ఊడ కూడా వుండేది కాదు. మర్రి చెట్టుకి ఊడలేకపోవడం విచిత్రం. ఆ చెట్టు మీద దయ్యముందని చెప్తుంటారు. ఆ మాటెలావున్నా చీకటి రాత్రుల్లో చెట్టు దగ్గరకెళ్ళి చూస్తే మాత్రం ఒక పెద్ద శక్తిలా కనిపించేది. ఆ చెట్టు ఎప్పుడు పుట్టిందో తెలియదు కానీ కనీసం ఓ రెండు వందల ఏళ్ళైనా అయ్యింటుంది. ఆ చెట్టు నీడలోనే నేను తొలిసారిగా నాటక రచన చేసింది. అందుకే ఆ చెట్టంటే నాకు ప్రాణం. ఊర్లో వున్నప్పుడు కనీసం వారానికొకసారైనా ఆ చెట్టు మొదలు వద్ద కూర్చొని వచ్చేవాడిని. ఎన్ని పనులున్నా ఇది ఆపేవాడ్ని కాదు. ఇదీ ప్రకృతి ఆరాధనలో భాగమేనేమో! ఈ పదేళ్ళలో ఒక్క సారి కూడా పోలేకపోయాను. అటువంటి వైభవోన్నత వృక్షరాజం ఇవాళ కళింగ యుద్ధంలో గాయపడ్డ క్షతగాత్రిలా ఆకులన్నీ రాల్చుకుని బాహువులొక్కొక్కటినీ ఊడ్చుకుంటూ వధ్యశిల మీద తలవాల్చే బలిపశువులా వుంది. ఆ మూలాగ్రం ఎండి పోయి కళావిహీనమై ఎప్పుడెప్పుడు కూలుదామా అని రోజులు లెక్కపెడ్తున్నట్లుంది. యుద్ధ రంగంలో నిలువెల్లా శరపరంపరల గాయపడ్డ వస్తాదులా వుంది. నా కంట్లోంచి అశ్రుబిందువులు అప్రయత్నంగా సుళ్ళు తిరుగుతూ జలజలా రాలసాగాయి. ఇంతటి విపత్కర స్థితికి కారణమేమిటా అని చుట్టూ చూశాను. ఆ చెట్టు మొదలుకు కొద్ది దూరంలో ఉప్పునీటి గొయ్యిలు చేసివున్నాయి. దాన్నిండా ఉప్పు నీళ్ళున్నాయి. ఇంకేం బతుకుతుంది. మర్రి చెట్టే కాదు ఏ మహావృక్షమైనా బతికే అవకాశం లేదు. మనసంతా కల్లోలంగా వుంది. "ఒరే రాజారావ్. ఏమిటీ దారుణం. ఇంత పెద్ద చెట్టు ఇలా అయిపోయిందేం" అన్నాను మనసంతా వికలమై మాటల్ని ఏరుకుంటూ.

"అదంతా రొయ్యల చెరువుల వల్లే జరిగిందన్నా" అన్నాడు క్యాజువల్‌గా.

"అయినా ఇంత దారుణం జరుగుతుంటే ఊర్లో పెద్దలేం చేస్తున్నారు." "ఏం చేస్తారు. అది వాళ్ల స్థలం వాళ్ళిష్టం. పెద్దలేం చేస్తారు." "అయినా మాత్రం ఇంతపెద్ద చెట్టుని ఇలా ఎండబెట్టేశారేంట్రా...?"

"అన్నా...లక్షలు తెచ్చిపెట్టే రొయ్యల పంటను కాదని అంతా నీలా చెట్టు కోసం ఆలోచిస్తారా"

వీడు కూడా మామూలు మనిషే కదా! వీడు కూడా అందరిలాగే ఆలోచిస్తున్నాడు. కానీ నేనలా కాదు ప్రకృతి ప్రేమికుణ్ణి.

"అయినా చెట్టు తల్లిలాంటిది కదరా! అలా ఎండబెట్టి చంపడానికి వారికి మనసెలా ఒప్పిందిరా..."

"సూడన్నా ...రొయ్యల చెరువంటే డబ్బు. ఆ డబ్బు ముందర అనుబంధాలూ ఆత్మీయతా అనురాగాలూ ఏమీ కనబడవు. అంతెందుకు తోడబుట్టిన వాళ్ళనే వదిలేస్తున్నారీ మధ్య ఊర్లో!"

నిజమే వాడొక కఠోర సత్యాన్ని బయటపెట్టాడు. నా పిచ్చి కానీ అనుబంధాలూ, బంధుత్వాలూ దూదిపింజలవుతున్న ఈ రోజుల్లో ఏ మాత్రం ఆర్థిక సంబంధాల్లేని చెట్టు గురించి మనుషులెలా ఆలోచిస్తారు?!

"హు! ఎంత అన్యాయం రా...వందల ఏళ్ళు ముందు పుట్టి ఊరంతటికీ చల్లదనాన్ని అందించిన మర్రి చెట్టునిలా జీవచ్ఛవం చేసి చంపడం...! ఈ ఊర్లో మనసున్న వాళ్ళే లేరా... అందరూ డబ్బుకు అమ్ముడుపోయారా?! డాలర్ల పంట ఆత్మీయానురాగాల్ని అనుబంధ బాంధవ్యాలను ఇంత ఘోరంగా దెబ్బతీస్తోందా.... ఎక్కడో దూర దేశాల వారు తినడానికి ఇక్కడి పర్యావరణాన్ని నాశనం చేసి ఇన్ని చెట్లను ఎండబెట్టి రొయ్యల్ని పెంచాలా...ఇదేమి అన్యాయం....ఎన్నో తరాలకు చల్లదనాన్నిచ్చి ఎన్నో పక్షులను తన కడుపులో పొదువుకుని కాలాతీతంగా నిల్చిన చెట్టును నిర్దయగా ఎండబెట్టి ఈ డాలర్ సాధించేదేమిటి?"

మనసంతా అల్లకల్లోలం. ఉచ్ఛ్వాస నిశ్వాసలు తప్ప ఏమీ వినబడడం లేదు. అలాగే స్థాణువులా ఎంతసేపు నిలబడిపోయానో తెలియదు. రాజారావు "అన్నా! అన్నా! పోదాం రా" అని భుజం పట్టి కదిపేసరికి ఈ లోకంలోకొచ్చినా... అప్రయత్నంగానే ఇంటి వైపు అడుగేశా...

✦

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

ప్రత్యేకం

నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణించడం మంచి పరిణామం. అయితే నాయకత్వం విషయంలో మహిళలు సమాన హక్కుని పొందలేకపోతున్నారు. పితృస్వామిక వ్యవస్థ వేళ్ళూనుకున్న ఈ దేశంలో.... ఎన్నో ఏళ్లుగా అధిపతులుగా చలామణీ అవుతోంది పురుషులే. వైజ్ఞానిక రంగంలో కూడా ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు కోసం మహిళల్లో ధైర్యాన్ని అందిస్తోంది అంటార్కిటికాకి చెందిన హోమ్‌వర్డ్ యాత్ర. ఈ ఏడాది సంస్థ నిర్వహించనున్న యాత్రకి భారత్ నుండి ఎంపికైన తొలి మహిళ పూర్వి గుప్తా గురించి మీరూ తెలుసుకోండి.

అంటార్కిటికా వనిత

యునెస్కో నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 53 శాతం మంది మహిళలు వైజ్ఞానిక రంగంలో మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తే, 43 శాతం డాక్టరేట్, 28 శాతం రీసెర్చ్ విద్యని పూర్తిచేసుకున్నవారు. ఇక భారత్‌లో సైన్స్‌లో ఉన్నత విద్యని పూర్తిచేసుకున్నవారు 14.3 శాతం. మద్రాస్ ఐఐటిలో ఇంజినీరింగ్ పూర్తిచేసుకుంది పూర్వి. అప్పుడు తన తరగతిలో వున్న మహిళలు పదిశాతం మాత్రమే. చదువు తర్వాత ఉద్యోగంలో కొనసాగేవారి సంఖ్య మరింత తక్కువగా వుండేది. ప్రస్తుతం అమ్మాయిలు విద్యావంతులవుతున్నారు. ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. అయితే వివాహం, కుటుంబ బాధ్యతలని చూసుకుంటూ పురుషులకంటే అధికంగా మహిళలే పనిచేయాల్సి వస్తోంది. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్త్రీలలో కీలక స్థానాలని అందుకున్న వారి సంఖ్య వేళ్లపైనే లెక్కెట్టొచ్చు. ఇలాంటి పరిస్థితులన్నీ చిన్న చిన్న రంగాల్లో కాదు ప్రతిష్టాత్మకమైన ఇస్రో లాంటి సంస్థల్లో కూడా కొనసాగడం విచారకరం అంటారు పూర్వి. ఇస్రోని స్థాపించి అరవై ఏళ్ళు పూర్తయ్యాయి. చైర్‌పర్సన్‌గా ఇప్పటికి తొమ్మిది మంది బాధ్యతలని నిర్వర్తించారు. అందులో ఒక్క మహిళ కూడా లేకపోవడం తనని మరింతగా కలచివేసే అంశం అంటారు పూర్వి. ప్రస్తుతం లండన్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్నారు పూర్వి. భారతీయ స్పేస్ ఏజెన్సీలో పనిచేస్తున్న 14 వేల మందిలో మహిళలు 20శాతంగా పనిచేస్తున్నారనేది ఓ నివేదిక. వైజ్ఞానిక ఉనికిని చాటే కీలకమైన రంగాల్లో మహిళలు ఉన్నత శిఖరాలని అందుకోలేకపోవడం పూర్వి అభిప్రాయాన్ని



బలపరిచే విషయం. ఇలాంటి మహిళలకు ఎంతో ధైర్యాన్ని నూరిపోస్తోంది అంటార్కిటికా యాత్ర. ఇంతకీ ఈ యాత్ర ఏంటనేగా మీ సందేహం..ఉన్నత విద్యని పొందిన మహిళలు ఇంటి బాధ్యతలు, కింది స్థాయి ఉద్యోగాలకే పరిమితం కాకుండా అధికారిక పదవుల్లో కొనసాగేలా వారికి చేయూతనిస్తూ ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు మొదలయ్యిందే హోమ్‌వర్డ్ బౌన్డ్ యాత్ర. అంటార్కిటికాకి చెందిన సామాజిక కార్యకర్త ఫ్యాబియన్ డ్యాటేనర్ నేతృత్వంలో గత సంవత్సరం ఈ యాత్ర మొదలయ్యింది. పూర్తిగా మహిళా నేతృత్వంలో నిర్వహించే ఈ యాత్రలో వివిధ దేశాలకి చెందిన దాదాపు 76 మంది మహిళలు భాగమవ్వడం మరో విశేషం. వివిధ సంస్థల్లో విధి విధానాలు, మహిళలు ఉన్నతికి సంబంధించిన విషయాలపై యాత్రలో చర్చలు నిర్వహిస్తారు. పది సంవత్సరాల్లో మహిళల్లో పూర్తి స్థాయి నాయకత్వ లక్షణాలని పెంపొందించే లక్ష్యంతో మొదలైన ఈ యాత్ర ఏడాది పాటు కొనసాగుతుంది. మహిళా నాయకత్వం, ప్రాపంచిక విషయ అవగాహన థీమ్‌తో గత సంవత్సరం అంటార్కిటికా యాత్ర మొదలయ్యింది. త్వరలో ఈ యాత్ర ముగుస్తుండంతో మరోయాత్రకి సన్నాహాలు మొదలయ్యాయి. ఈసారి భారత్ తరపున నేతృత్వం వహించనుంది పూర్వి. వృత్తి పరంగా తన అనుభవాలతోపాటు పర్యావరణ పరిరక్షణకి సంబంధించిన వివిధ అంశాలపై పూర్వి ప్రసంగించనున్నారు. తన ప్రసంగం మరికొంతమంది మహిళల్లో స్ఫూర్తిని అందించాలని కోరుకుందాం. ✦

తెలంగాణ కవులు

1890, 1893లో పుట్టిన శేషాద్రి రమణ కవులు జంటకవులు. అన్నదమ్ములు. వీరిద్దరు కలసి ఎన్నో అవధానాలు చేసి కీర్తి గడించారు. అదే జీవిత ధ్యేయమనుకోకుండా ఎన్నో చారిత్రిక ప్రదేశాలు పర్యటించి శాసనాలు, నాణేలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి వాటిలో వున్న తెలుగువారి చరిత్రను పరిశోధించి పుస్తకాలు రాశారు. వీరు చేసిన పరిశోధనల్లో ముఖ్యమైనవి పోతన రాయలసీమలోని ఒంటిమిట్ట వాడు కాదనీ, తెలంగాణంలోని బమ్మెరలో పుట్టాడని, రుద్రమదేవి గణపతిదేవ చక్రవర్తి భార్య కాదనీ కూతురనీ, ముఖ్యంగా తెలంగాణంలోని తెలుగువారు వలసవచ్చిన వారు కాదనీ, తెలుగు వారికి తెలంగాణమే మెట్టమొదటి నివాసమని చెప్పిన వారు వీరు. వీరు పద్య కావ్యాలు కాకుండా నవలలు, గద్యం కూడా రాసారు. వీటిలో 38 గ్రంథాలు ప్రచురించబడ్డాయి. ఎన్నో పుస్తకాలకి పీఠికలు రాసారు. ఎన్నో పత్రికలకు, ప్రత్యేక సంచికలకు పద్యాలు, వ్యాసాలు, గేయాలు, కథలు రాశారు.

శేషాద్రి రమణ కవుల గురించి వారి జీవన రేఖలను, రచనా జీవితాన్ని, తెలంగాణకు వారు చేసిన సేవల గురించి బి రామరాజుగారు రాసిన పుస్తకం సులభమైన శైలిలో ఆసాంతం చదివింపచేస్తుంది. రాజానాయని వేంకటరంగారావు బహద్దూర్ స్వాతంత్ర్యం రాకముందు మన దేశంలో, ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులు, సాహిత్యాకారులని పోషించిన వారిలో ఒకరు. తెలుగు పుస్తకాలు ప్రచురించడానికి తగిన ముద్రణ శాలలు లేని సమయంలో పుస్తక ముద్రణకై వీరు విజ్ఞాన చంద్రికా పరిషత్తును విజ్ఞాన చంద్రికా గ్రంథాలయాన్ని స్థాపించారు. హైదరాబాదులో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించారు. వీరి జీవిత విశేషాల గురించి శ్రీ కేశవపంతులు నరసింహ శాస్త్రిగారు, భాషాసేవ గురించి ఆచార్యతూమాటి దొణప్పగారు ఈ పుస్తకంలో ఎన్నో వివరాలందించారు.

శ్రీరంగరాయ జీవితం రావిచెట్టు రంగారావుగారు ఆంధ్రభాష పట్ల ఎంతో అభిమానం కలవాడు ఆంధ్ర భాషానిలయాన్ని హైదరాబాదులో స్థాపించి ఎన్నో ఏళ్ళు దానికి కార్యదర్శిగా పనిచేసారు. గ్రంథాలయాలుంటే సరిపోదు పిల్లలు చదువుకోవడానికి పాఠశాలలుండాలని స్థాపించారు. ఈ విషయాలను వీరభద్రరావుగారు ఎంతో ఆసక్తికరంగా వెల్లడించారు. ఈ ముగ్గురూ భాషాభిమానులు. సాహిత్య ప్రేమికులు. తెలుగు సాహిత్యంపై సంస్కృతిపై ఆసక్తి కలిగించారు.

- మందరపు హైమవతి

పుస్తకం పేరు : శేషాద్రి రమణకవుల జీవితం.
రచయిత : డా బి రామరాజు
పుటలు: 32
వెల: రూ:30/-

పుస్తకం పేరు : రాజా నాయని వేంకట రంగారావు బహద్దరు
రచయితలు : కేశవ పంతుల నరసింహశాస్త్రి,ఆచార్య తూమాటి దొణప్ప
పుటలు : 38
వెల : రూ:30/-

పుస్తకం పేరు : శ్రీరంగ రాయ జీవితం రావిచెట్టు రంగారావు
రచన: ఆదిరాజు వీరభద్రరావు,
పుటలు : 38
వెల : రూ.30/-
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవతెలంగాణ బుక్ హౌస్‌ల్లో.



ఐన్‌స్టీన్ సందేశం

సరిగ్గా 5000 ఏళ్ల తర్వాత ప్రపంచం ఎలా ఉంటుంది? మనిషి ఎలా ఉంటాడు? ఎంత పురోగతిలోకి వెళతాడు? లేదా తిరోగమనంలో పడతాడా? ఈ ప్రశ్నలు పందేళ్ల క్రితమే కలిగాయి. అప్పటికే సైన్స్ రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. దశాబ్దాల క్రితం చూసిన ప్రపంచానికి ఏ మాత్రం పోలిక లేనంతగా మారిపోయింది. ఇక కనుక్కోవాల్సింది ఏమీ ఉండదేమో అన్నంత మహా ప్రస్థానమది. ఆ శతాబ్దికి చెందినవాడే ఐన్‌స్టీన్. ఇలాంటి మహా శాస్త్రవేత్తల తరంతో పై ప్రశ్నకు ఓ సందేశం భావి తరాలకు పంపాలనుకున్నారు. అది కూడా 5000 ఏళ్ల తర్వాతి తరం వారికి. అందుకు వాళ్లు 'టైమ్ క్యాప్సూల్'ను ఎంచుకున్నారు. అణు బాంబు పడినా పాడవకుండా ఉండేంత దృఢంగా ఓ క్యాప్సూల్‌ను తయారు చేసి దాన్ని భూమి లోపల పాతి పెట్టారు. కాపర్, క్రోమియమ్, వెండి లోహాల్ని కలిపి చేసిన 'క్యూపాల్లాయ్'తో దాదాపు 350 కేజీల బరువుండే క్యాప్సూల్ చేశారు. 1939 సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో వరల్డ్ ఫెయిర్ జరిగింది. ఈ సందర్భంగా కొరొనా పార్క్‌లోని ఫ్లషింగ్ మెడోస్‌లో ఈ క్యాప్సూల్‌ను 50 అడుగుల కింద పాతి పెట్టాలని నిర్ణయించుకున్నారు.

ఇలా బతికామని...

క్యాప్సూల్‌లో ఓ సందేశం రాసేందుకు దిగ్గజ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్‌ను ఎంచుకున్నారు. ఆయన భావి తరాలకు ఇచ్చిన సందేశాన్ని ఓ మైక్రోఫిల్మ్‌పై రాసి క్యాప్సూల్‌లో వేశారు. 'మా సృజనాత్మక మెదళ్లతో, ఆవిష్కరణలతో గొప్పగా జీవించాం... మేం ఎగరగలిగాం... సముద్రాలు దాటాం.... శక్తిని ఉపయోగించి శ్రమను తగ్గించుకోగలిగాం... ప్రతిదీ కావాలనే అత్యాశతో, అస్తవ్యస్తమైన ఉత్పత్తి, సరఫరాలతో, ఆర్థిక చట్రం నుంచి తొలగించబడతామనే భయం, బాధలతోటి బతుకుతున్నాం... విరామాల మధ్య యుద్ధాలతో భయం, క్రూరత్వాల్లోనే జీవించాలనే ఆలోచనలతోనే గడిపాం... భావి తరాలు ఈ సందేశాన్ని ఉన్నత ఆలోచనలతోటి చదివి అర్థం చేసుకుంటాయని నమ్ముతున్నాను.... ప్రపంచ సమస్యల్ని మానవ జాతి పరిష్కరించగలదనే నమ్మకంతో మా వారసత్వాన్ని మీకు అందిస్తున్నాం....' అంటూ సాగే సుదీర్ఘమైన గొప్ప సందేశాన్ని రాసిచ్చారు ఐన్‌స్టీన్. ఈ సందేశంతో పాటు 35 రోజువారీ గృహావసర వస్తువులు, లైఫ్ మేగజీన్‌లు, 75 రకాల వస్త్రాలు, లోహాలు, ప్లాస్టిక్‌లు, అప్పటి కళాకృతులు, న్యూస్ రికార్డులు, గోధుమ, సోయా, మొక్కజొన్న, ఆల్ఫాల్ఫా విత్తనాల్ని ఉంచారు. కోటి అక్షరాలు, వేయి చిత్రాలతో కూడిన మైక్రో ఫిల్మ్‌ను ఉంచారు. దాన్ని చూసేందుకు ఒక మైక్రోస్కోప్‌ను జతచేశారు. క్రీ.శ. 6939 వరకు చెక్కు చెదరకుండా ఉండేలా నిష్క్రియ నైట్రోజన్ వాయువుతో క్యాప్సూల్‌ను నింపారు. దాదాపు ఇలాంటి క్యాప్సూల్-2నే 1964లోను న్యూయార్క్ వరల్డ్ ఫెయిర్ సందర్భంగాను నేలలో పాతిపెట్టారు. ఎప్పుడో 5000 ఏళ్ల తర్వాతి తరానికే కాదు నేటి తరానికి కూడా పనికొస్తుందది. ◆

మటర్ పనీర్

కావాల్సిన పదార్థాలు

పనీర్ -250 గ్రాములు
బఠాణీలు-1/2కప్పు (ఉడికించినవి)
టమాటా ప్యూరీ-2కప్పులు
ఉల్లితరుగు-1/4కప్పు
వెల్లుల్లి రెబ్బలు-2
పసుపు-1 టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి- 1టేబుల్ స్పూన్
నూనె-1 టేబుల్ స్పూన్
ఉప్పు- తగినంత
కొత్తిమీర తరుగు-5 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ముందుగా పనీర్‌ని మీడియం సైజు ముక్కలుగా కట్‌చేసి పెట్టుకోవాలి. మిక్సీ జార్‌లో అల్లం, వెల్లుల్లి, ఉల్లి తరుగు వేసి మెత్తగా బ్లెండ్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసి పక్కన పెట్టుకోవాలి. బఠాణీలని మెత్తగా ఉడికించుకోవాలి. ఇప్పుడు స్టవ్‌పై పాన్ పెట్టి వేడెక్కిన తర్వాత ఉల్లి పేస్ట్ వేసి మీడియం మంటపై బంగారు రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. అందులో టమాటా ప్యూరీ, పసుపు, జీలకర్ర పొడి, గరమ్ మసాలా పొడి, ఉప్పు, కారం వేసి కొద్దిసేపు ఉడికించాలి. అందులో కొద్దిగా నీరుని చేర్చి మరికొంతసేపు ఉడకనివ్వాలి. అందులో పనీర్ ముక్కలు, ఉడికించిపెట్టుకున్న బఠాణీలని కూడా వేసి మరికొంతసేపు ఉడకనివ్వాలి. స్టౌపై నుంచి తీసి కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే మటర్ పనీర్ రెడీ!

మష్రూమ్ పసంద్



కావాల్సిన పదార్థాలు

పుట్టగొడుగులు-500గ్రాములు
ఉల్లిపాయలు-2
టమాటాలు-3
బాదం పలుకులు-20
వెల్లుల్లి రెబ్బలు-6
అల్లం తరుగు - 2 టేబుల్ స్పూన్లు
పచ్చిమిర్చి తరుగు- 1 టేబుల్ స్పూన్
జీలకర్ర-1 టీ స్పూన్
దాల్చిన చెక్క- చిన్నది
బే ఆకు-1
మిరియాల పొడి-1/2 టేబుల్ స్పూన్
పసుపు-1/2 టేబుల్ స్పూన్
ధనియాల పొడి-1 టేబుల్ స్పూన్
గరమ్ మసాలా పొడి- 1 టేబుల్ స్పూన్
మెంతి ఆకుల పొడి -1 టేబుల్ స్పూన్
పాలు-1/4 కప్పు
వెన్న-1 టేబుల్ స్పూన్
నూనె - మూడు టేబుల్ స్పూన్లు
ఉప్పు-రుచికి సరిపడా
నీరు-తగినన్ని
కుంకుమ పువ్వు-రెండు రెబ్బలు

తయారు చేసే విధానం

ముందుగా గోరువెచ్చని పాలలో కుంకుమ పువ్వుని వేసి పక్కన పెట్టుకోవాలి. పుట్టగొడులని శుభ్రంగా కడిగి తడిలేకుండా ఆరనివ్వాలి. అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయలు, టమాటా, పచ్చిమిర్చిని చిన్న ముక్కలుగా కట్టచేసి పెట్టుకోవాలి. మీడియం సైజు పుట్టగొడుగులని తీసుకుని సగానికి కట్‌చేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత అల్లం, వెల్లుల్లి, ఉల్లిపాయ ముక్కల్ని వేసి వేయించుకోవాలి. అందులో టమాటా ముక్కలు, బాదం పలుకులు, పచ్చిమిర్చి తరుగు వేసి ఉడికించుకోవాలి. టమాటాలు పూర్తిగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమాన్ని తీసి చల్లారనివ్వాలి. చల్లారిన మిశ్రమాన్ని మిక్సీ జార్‌లో వేసి ఒకసారి బ్లెండ్ చేసుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక బాణలి వుంచి కొద్దిగా వెన్న వేయాలి. అందులో తరిగిపెట్టుకున్న పుట్టగొడుగులని వేసి వేయించుకోవాలి. అందులో జీలకర్ర, టేబుల్ స్పూన్ నూనె, జీలకర్ర, దాల్చిన చెక్క, బే ఆకు, మిరియాల పొడి వేసి రెండు నిమిషాలు వేయించాలి. అందులో టమాటా పేస్ట్‌ని వేసి బాగాకలిపి కొద్ది నిమిషాలు ఉడికించాలి. అందులో పసుపు, కారం, కొత్తిమీర పొడి వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో మరికొంచెం వెన్న, ఉప్పు, వేడి నీరు వేసి బాగా కలుపుకోవాలి. పుట్టగొడుగులు పూర్తిగా ఉడికి గ్రేవీ కాస్ చిక్కబడే వరకు వుంచి తర్వాత అందులో కొద్దిగా పంచదార, గరమ్ మసాలా పొడి, మెంతి ఆకుల పొడి, కుంకుమ పువ్వు మిశ్రమం వేసి మూడు నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఉప్పు సరిచూసుకుని ఒక బౌల్‌లోకి ఈ మిశ్రమాన్ని తీసుకోవాలి. పరాటా, నాన్ లేదా రోటీతో పనీర్ పసందా కర్రీని రుచిచూడండి.

పనీర్ డిప్

కావాల్సిన పదార్థాలు

పనీర్-1 కప్పు
జున్ను-1 కప్పు
ఆలివ్ నూనె-2 టేబుల్ స్పూన్లు
వెల్లుల్లి రెబ్బలు 2 టేబుల్ స్పూన్లు
నేరేడు కాయలు -7
బెల్ పెప్పర్-1 టేబుల్ స్పూను
ఉప్పు- రుచికి సరిపడా
కారం -1 టేబుల్ స్పూను

తయారుచేసే విధానం

ముందుగా స్టౌపై ఒక ప్యాన్ పెట్టి కొద్దిగా ఆలివ్ నూనె వేసి వేడెక్కనివ్వాలి. అందులో బెల్ పెప్పర్, ఉప్పు వేసి కలుపుకోవాలి. అందులో పనీర్ వేసి మీడియం మంటపై వేయించుకోవాలి. చీజ్‌ని పేస్ట్‌లా చేసుకుని ఈ మిశ్రమంలో వేయాలి. చీజ్‌లో నీరు ఇంకిపోయేలా ఈ మిశ్రమాన్ని కొద్ది సేపు చిన్న మంటపై ఉడకనివ్వాలి. ఇప్పుడు ఒక స్పూన్ ఆలివ్ నూనెని చేర్చి అందులో వెల్లుల్లి రెబ్బలు నేరేడు కాయల తరుగు వేసి కలుపుకోవాలి. ఉప్పు, కారం సరిచూసుకుని ఐదు నిమిషాల తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై నుంచి దించేయాలి. రుచికరమైన ఈ పనీర్ డిప్‌ని రోటీతో టేస్ట్ చేయండి.

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: పవన్ కళ్యాణ్





ఎన్ని ఉన్నాయి?

ఇక్కడ తెర పక్కన కనిపిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు మరో మనిషి ముఖం కూడా దాగుంది. అదెక్కడుందో గుర్తించి సున్నా చుట్టేయండి.



నీడతో బొమ్మ

పిల్లలూ మీకు బొమ్మలంటే భలే ఇష్టం కదూ! చేతి వేళ్లతో కుక్క బొమ్మ ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం. చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నించండి.

చుక్కలు కలపండి



ఏ నీడ ఎవరిది?

పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువులు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.

ఆకులతో బొమ్మ

పదాలు పూరించండి

ఇక్కడ తొమ్మిది బొమ్మలున్నాయి. వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీలో నింపేయండే!



జ: doll, cake, fall, bell, deer, toy, truck, ball, train

ఫిఫాకు చాన్స్

పిల్లలూ మీకు క్రీడలంటే చాలా ఇష్టం కదా...మీలో చాలా మంది క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ ప్లేయర్‌లు కూడా వుండే వుంటారు. ట్రోఫీలనీ సాధించే వుంటారు. మరి మీకు సుజల్ కహార్ గురించి తెలుసా? ఇంతకీ సుజల్ ఎవరనేగా మీ సందేహం. ముంబయిలోని సాయిబాబాపథ్ ఇండిగో స్కూల్లో చదువుతున్నాడు సుజల్. టీ వీలో ఫుట్‌బాల్ మ్యాచ్‌లు చూస్తూ ఈ క్రీడపై ఇష్టాన్ని పెంచేసుకున్నాడు సుజల్. తొమ్మిది పదేళ్ల వయసులో ప్రాక్టీస్ కూడా మొదలెట్టేశాడు. అందులోనూ వికెట్ కీపింగ్ అంటే ఇంకా ఇష్టం. అందుకోసం తండ్రిని బతిమాలి గ్లౌజులని కూడా కొనిపించేసుకున్నాడు. స్కూల్ నుంచి ఇంటికి రాగానే ఇంటి వద్ద వుండే ఫ్రెండ్స్‌తో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ మొదలెట్టేసేవాడట. నిజానికి స్కూల్ ఫుట్ బాల్ తప్ప మరో ప్రపంచం లేదతనికి. స్కూల్‌లో మనోడికి ఒక కోచ్ కూడా దొరికాడు. ఇక విక్కీగా అరితేరుతున్న సమయంలో ఓ మంచి అవకాశం వచ్చింది. అదేంటంటే..... రష్యాలోని పీటర్స్ బర్గ్‌లో జులైలో జరగనున్న ఐదవ ఫిఫా ఫుట్‌బాల్ ఫ్రెండ్‌షిప్ గ్లోబల్ ప్రోగ్రామ్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. భారత దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన ఆరితేరిన 20 మంది పిల్లల్లో ఫైనల్స్‌కి నలుగురు ఎంపికయ్యారు. ఆ నలుగురిలో సుజల్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి జెఎస్ కె (జస్ట్ ఫర్ కిడ్స్) నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచాడు. పన్నెండు సంవత్సరాల బాలబాలికలు మాత్రమే ఆడే ఈ మ్యాచ్‌లో మొత్తం ఎనిమిది జట్లు ఉంటాయి. వీరిలో అంగవైకల్యం ఉన్న చిన్నారులు కూడా అడేందుకు అనుమతిస్తారు ఫిఫా ఫుట్‌బాల్ ఫ్రెండ్‌షిప్ గ్లోబల్ ప్రోగ్రామ్‌లో భారత్ పాల్గొనడం ఇదే తొలిసారి. రష్యాలో జరగనున్న ఈ మ్యాచ్‌లో దాదాపు 60 దేశాలు పాల్గోనున్నాయి.

పదవికాసం - 64

కూర్పు: రావెళ్ల

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

ఆధారాలు

అడ్డం

1. నిరంతరం (4)
3. అసత్యం (4)
7. భార్య (2)
8. నెమలి పురి విప్పుతుంది. మరి పాము (3)
9. అటునుండి శరీరం (2)
12. దోమ (3)
13. నీరు మరిగితే (3)
17. బాగా నలిగిన (2)
18. మొలకెత్తిన విత్తు (3)
19. వానపాము (2)
22. పెద్ద నల్ల చీమ (4)
23. పశువుల గిట్టల్లో వచ్చే రోగం (4)

నిలువు

1. అలుపు (4)
2. సయోధ్య (2)
4. భార్య తండ్రి భార్య (2)
5. వెంటనే తక్షణమే (4)
6. ఆపకుండా ఏకధాటిగా తిడితే ఇది చదివారంటారు (3)
10. పక్షంలో పదో తిథి (3)
11. గుడ్డలు చుట్టి నూనెలో తడిపి వెలిగించే దీపం (3)
14. ప్రేమ (4)
15. ధోరణి (3)
16. పొరపడటం (4)
20. బాధ్యత (2)
21. తెలుపు (2)

సుడోకు

9		3		2		8		6
			3			4		2
		6		8	5	7	1	
			8		2			1
6								4
	3	2					7	
	1							7
4		8		5				
			4	3	1			

గతవారం జవాబులు

2	4	9	1	8	6	3	5	7
3	6	1	5	7	2	8	9	4
5	7	8	3	4	9	6	1	2
4	9	3	6	5	8	2	7	1
6	1	5	7	2	4	9	8	3
7	8	2	9	3	1	4	6	5
8	5	4	2	6	7	1	3	9
9	2	7	8	1	3	5	4	6
1	3	6	4	9	5	7	2	8

1 అం	గ	2 బి	ళ్ళ	✿	3 ఇం	4 దీ	వ	5 రం
గీ	✿	రి	✿	6 పూ	✿	పం	✿	తు
7 ర	క్ష	✿	8 వ	లు	9 వ	✿	10 బా	కా
స	✿	11 దీ	నం	✿	12 ఠీ	13 ధ	✿	దు
✿	14 క	పి	✿	✿	✿	15 రి	క్తం	✿
16 వై	✿	17 క	18 ష్టం	✿	19 రా	త్రి	✿	20 అ
21 ణి	రా	✿	22 ఇ	23 టు	క	✿	24 అ	భి
కు	✿	25 పా	✿	వీ	✿	26 ఉ	✿	మా
27 డు	కా	లు	వి	✿	28 ఉ	త్ప	త	నం

కేక్ పూలు

కొన్ని పూలను చూస్తే తినాలనిపిస్తుంది. వగరు తగులుతున్నా చప్పరిస్తూ కనీసం పూల పరిమళాన్నైనా ఆస్వాదిస్తే చాలు. తీయని వాసన టెంప్ట్ చేస్తున్నా పూలకెందుకా వగరు అని ముఖం ముడుచుకోకండి. అప్పుడే తాజాగా విచ్చుకున్న ఇవి పూలు కాదు కేకులు. పూల ఘుమఘుమలతోనే నోరూ, మనసూ ఊరిస్తున్నాయి కదూ. బెర్లిన్‌కు చెందిన జులియాన్నా అనే పాకశాల ప్రవీణ ఈ కేక్ పుష్పగుచ్ఛాల్ని తీయతీయగా అందిస్తున్నారు. సిరప్‌లో కాసింత వగరుంచి ఫ్లేవర్ వాడిపోకుండా జాగ్రత్త తీసుకున్నారులెండి. 'కలినరీ డాట్స్' పేరిట ఆమె వంటకాల్ని ఇంటర్‌నెట్‌లోను వండివార్చుతున్నారు. చక్కగా నేర్చేసుకుని మీరూ మీ వంట గదుల్లో ఈ కేక్ సుమాల్ని విరబూయించండి.



పుట్టుక-మరణం, ప్రేమ-ఎడబాటు, త్యాగం-వ్యామోహం, శాంతి-యుద్ధం, విప్లవం-నిరంకుశత్వం, సేవ-దోపిడీ ఈ విరుద్ధాల మధ్య నలిగినవి ఎర్ర గులాబీలు. యుద్ధాల్లో, ప్రజాపోరాటాల్లో అమరుల త్యాగాలకు ఎర్ర గులాబీల్ని చల్లే నివాళు లిస్తారు. తీవ్ర వాంఛను, వ్యామోహాన్ని అంతే గాఢమైన ఎర్ర గులాబీతో వ్యక్తం చేస్తారు. నిస్వార్థమైన చెలి ప్రేమను, చల్లనైన కన్నతల్లి వాత్సల్యాన్ని ఎర్ర గులాబీతోనే హత్తుకుంటారు. స్త్రీకి సింబాలిక్‌గా చెప్పుకునే గ్రీకు, రోమన్ ప్రేమ దేవతలు వీనస్, అఫ్రోడైట్‌లు ధరించేది ఈ రోజానే. మతం మధ్యలో వచ్చి ఎర్ర గులాబీల్ని మోహినులని విసిరికొట్టింది. కానీ ప్రజల్లో దానిపైనున్న మోహాన్ని వదిలించలేక రాజీ పడటమే కాదు ఏకంగా దానికి ఉన్నత స్థానాన్నిచ్చింది. ధనికులకు మాత్రమే అని సామాన్యునికి దూరం చేయబోతే అది పేదిళ్లల్లోను విరగబూసింది. ఇంగ్లండ్‌లో రెడ్ రోజ్ యుద్ధాలు జరిగాయి.. వారి జాతీయ పుష్పం కూడా అదే. యూరప్ శాంతియుత ప్రభుత్వ మార్పిడిలకు రెడ్ రోజ్ విప్లవం అని పేరు. న్యూజిల్యాండ్ రెడ్‌క్రాస్ సింబల్ కూడా అదే. ఎర్ర గులాబీలు మనిషిని ప్రేమలో పడేసి 5000 ఏళ్లు. ఇన్ని వేల ఏళ్ల చరిత్రలో షేక్స్‌స్పియర్, మోనెట్ వంటి ఎందరో కవులు, చిత్రకారులు, ప్రేమికులు, విప్లవకారులు, అమరుల్ని ముద్దాడింది ఎర్ర గులాబీ. ముళ్లున్నా మనసులో మొలవాలని కోరుకునే ఎర్ర గులాబీలకూ జూన్ 12న ప్రత్యేక రోజు అనుకుని వాటి గుబాళింపును చల్లుకుంటోంది ప్రపంచం. మీకూ రెడ్ రోజ్ గ్రీటింగ్స్ ఈ చిత్రాలతో...

ఎర్ర గుబాళింపు